నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com



## శివుడూ...!



దుఃఖం కవిత్వంలా వుంటుందా?
ఎదలో ఎగసిపడే
ఆవేదనా కెరటాలు
కవిత్వ పదాల్లా అలరారుతాయా?
ఒడిసి పట్టిన వాడికి తెలుస్తుంది
అనుభవానికొస్తేనే మనసు ఊరటపడ్తుంది.

వయస్సుతో పనేముంది?
ఒరుసుకుంటు ప్రవహించే కాలానికి
దయా దాక్షిణ్యాలు వుండవు
ముక్కలుగా చీలుతూ
ఒక్కో క్షణం వ్రణంలా సలుపుతుంది.

ఎగిరి పోయిన పిట్ట
ఏ గూడు చేరిందో?
యిక్కడి గుండె గుడిలో
విషాదం చిమ్మింది.

ప్రవృత్తి మాత్రమే కాదు
ఆ మహాకవి వృత్తి కూడా
కవన సృజనే!
వేలాది శోకతప్త హృదయాలను
ఓదార్చిన కవిత్వ పంక్తులు
ఆయనకే స్వంతం.
ఎన్నో దుఃఖ సంద్రాలకు
ఆనకట్టగా నిలచిన కలం అది.

దుఃఖ ప్రవాహం
కాలంతో బాటు యీడ్చుకెళ్తోంది
పాపం! కదలలేని స్థితి ఆయనది.
ఆగమవ్వకుండా
ఆదుకోవాల్సింది కవిత్వమే
చెమ్మగిల్లుతున్న చెంపలను నిమురుతూ
అలిసిపోతున్న గుండెను తడుముతూ
వెన్నుతట్టి నడపాల్సింది
ఆ కవిత్వ పాదాలే!

దుఃఖాన్ని వినడం
ఆయనకు కొత్తేం కాదు
విషాదం వెన్నంటి పీడిస్తున్నా
ముందు ముందుకు చూడటం
ఆయనకు చేతకానిదేమీ కాదు
జీవితంలో అన్నీ చూస్తున్న వాడే
స్వయానా అనుభవిస్తున్న వాడే..
అందుకే పుంఖాను పుంఖాలుగా
కవిత్వం రాయగలిగాడు.
యిప్పుడు ఆదరించాల్సిందీ
ఎదకు హత్తుకుని
ఓదార్చాల్సిందీ
కవిత్వమే!!



– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

పుస్తక సమీక్ష

## వ్యంగ్య కథనాలు యాప చెట్టు కాడ






ప్రతులకు: ఎస్. పద్మావతి
ఇ.నెం. 4-112/7/2
కెసిబి గార్డెన్ ఎదురుగా
రోడ్ నెం.3. భగవతీనగర్
ఆదిలాబాద్-504 001.

రచయిత డా॥ఉదారి నారాయణ వృత్తిరిత్యా స్కూలు అసిస్టెంట్. ప్రవృత్తి సమాజంలోని సమస్యలకు స్పందించి కవితలు వ్యాసాలు రేడియో నాటికలు వ్రాస్తారు. వీరిలోని సమాజ సేవ తత్పరత, స్పందన, వీరికి పలు పురస్కారాలు బహుమతులు తెచ్చిపెట్టాయి. 2001 నుండి తన రచనలను ప్రకటిస్తున్నారు. ఆకుపచ్చని ఎడారి, యాలైంది, మాగిపొద్దు, అరుగుమీది ముచ్చట్లు (లఘు నాటికలు) మళ్ళీ మనిషిలోకి వీరి కవితా సంచికలు. పలు కవితా సంకలనాలకు సంపాదకత్వం వహించారు. స్వయంగా కవితలపోటీలు, కవిసమ్మేళనాలు నిర్వహిస్తూ సాహిత్యం మీద తన ప్రేమను చాటుకున్నారు ఉదారి నారాయణ. ఊళ్ళలో రచ్చబండ, నాలుగు రోడ్ల కూడలి, లేదా ఓ ప్రాచీన హోటల్ ముందు నలుగురు ప్రోగయి మంచి చెడ్డలు, ఊరి సంగతులు చెప్పుకోవటం కద్దు. ఊరి ముచ్చట్లు యెడ ఉత్సుకతా ఉన్న నారాయణగారు రచ్చబండ ముచ్చట్లను 'యాపచెట్టు కాడ' అన్న పేరుతో ప్రచురించారు. లోగడ ఇవి ఓ ప్రముఖ దిన పత్రికలో ప్రచురించబడి జనాదరణ పొందినవి. రచయిత వీటిని సామాజిక, రాజకీయ వ్యంగ్య కథనాలుగా చెప్పుకున్నారు. సుమారు వంద పేజీలున్న ఈ చిన్ని సంకలనంలో, ఎక్కువ భాగం రాజకీయ నాయకులు ఎలక్షన్లకు ముందు వారి ప్రవర్తన, ఎలక్షన్ల తరువాత వారు జనాన్ని విస్మరించి కనబడకపోవటం, ఎలక్షన్లకు ముందు మరియు ఆ తర్వాత వారి ఆర్థిక స్థితిగతులు, ఓటర్ల యెడ వారి ప్రవర్తన లాంటివి వ్యంగ్య ధోరణిలో ప్రకటించారు. అన్నీ షార్ట్ టాల్స్. 2/3 పేజీలు మించవు కథనం అంతా సామాన్య మానవుల సంభాషణల రూపంలో నడుస్తుంది. కథనం అంతా ఆదిలాబాదు జిల్లా గ్రామీణ జన సంభాషణ రూపంలో నడుస్తుంది. మరొక్క విశేషం! నారాయణగారి కథనం అంతా తన పల్లెటూరి ఊరు వాతావరణం చిత్రణ మధ్య సాగుతాయి. కనుక ప్రేక్షకుడు ఓ చిన్న నాటకం చూస్తున్న అనుభూతి కలుగుతుంది. కొన్ని శీర్షికలు చదవగానే విషయం పట్ల అవగాహన పాఠకుడికి కలుగుతుంది. ఇండ్లు ఇడగొడుతున్న ఎలచ్చన్లు. లగ్గం (రాజకీయ) లీడర్ల సందడి, ఏ ఎలక్షన్లలో నయినా 'దొరల చుట్టూ తిరిగిన ఎలచ్చన్లు. నీ కాల్మొక్త బాంచెన్ నాకే ఓట్లెయొండి మంచోల్లకే మన ఓటు, ఓట్ల కోసం నోట్లకట్టలు, నుక్సాన్ జేస్తున్న టికిట్ల లొల్లి, గోడలు కరాబ్ చేస్తున్న ఎలచ్చన్లు. చిట్టీల దందా చేస్తున్న మోసం (చిట్టీల మోసం) దుర్వినియోగం అవుతున్న రేషన్ వస్తువులు (దారి తప్పుతున్న కంట్రోల్ సామాను వెయింగ్ మెషీన్లు చేసే మసం( కాటాలనే ఉన్నది కమాలంత) ఇల్లు ముంచుతున్న కల్లు, చచ్చి సాదిచ్చేదేమి, వాస్తుపేరిట మోసాలు వంటి సామాజిక సమస్యల్ని కూడా చర్చకు పెట్టారు రచయిత. కథనాలు అన్నీ రచయిత, స్వంతూరి భాష యాసలో సాగుతుంటాయి. కనుక ఇతర జిల్లాల పాఠకులు తరిచి తరిచి చూసి, చదివి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. పుస్తకం చివర ఇలాంటి పదాలకు సామాన్య అర్థాలు వివరణలు ఇస్తే.. బావుండేది.



– కూర చిదంబరం
సెల్:8639338675

## కళోజీ



కం.
మనయాసలు,మనభాషలు
ఘనమైనవటంచుమిగుల
కాళోజీయే
నినదించియుధైర్యముగా
తనరచనలజూపినారుతత్వజ్ఞునిగా

కం.
అక్షరమేకదిలించును
లక్షలమెదడునునటంచు
రసరమ్యముగాన్
శిక్షలనెన్నోవేసిన
దీక్షగజేసెనురచనలుధీమంతుడై.

కం.
ఉద్యమమేయూపిరిగా
నుద్యుక్తుడునయ్యిమిగుల
నుత్సాహమునన్
ఉద్యమమునకాళోజీ
గద్యపుకవితల్నొసంగె×
కమనీయంగా!

కం.
వెలుగులువిరబూయించెడు
తెలుగునకాళోజిగారు
తెలగాణములో!
ఎలుగెత్తిచాటినారిల
పలుకుబడులభాషటంచు
భాసిలజేసెన్

కం.
నీవేస్వార్థములేకయు
చావూపుట్టుకలుతప్ప
సర్వస్వమునా!
జీవితమంతయునీభర
తావనిదనిదెల్పినట్టిధన్యుడవయ్యా.

కం.
ధీటగుకవితాఝరులన్
ధాటిగనెదిరించినిలచి
దౌర్జన్యములన్
తూటాలైపేలగనా
ఘూటేకాళన్నగారిగంభీరతమగనన్

కం.
ఆరాటముతోడ ప్రజా
పోరాటములెన్నొజేసి స్ఫూర్తినినింపెన్
భారమునెంచకదిరుగుచు
పేరుగడించెనుప్రజాక
విగకాళోజీ!

కం.
జనగోసనువినిపించెను
ఘనముగనాగొడవలోన
కాళోజీగా
సునిశితముగ స్పృశియించెను
తనకవనపుధారతోడ
ధైర్యమ్ముగతాన్!

–జి.లింగేశ్వర శర్మ
9603389441

## గురు దైవం



తను కరుగుతూ వెలుగులు..
పంచే త్యాగాల కొవ్వత్తి గురువు !
పుస్తక పాఠ్యాంశాలతో పాటు..
జీవిత పాఠాలు నేర్పే మేధావి !
నడిచే ఆదర్శాల పెన్నుధి..
అంధకారంలో దారి దీపం !
ఆత్మ విశ్వాస జ్ఞాన రసాన్ని..
నూరి పోసే మానసిక వైద్యుడు !
వెన్నుతట్టి నడక, నడతల్ని..
బోధించే నిస్వార్థ జీవి గురువే !
జీతం కన్న జీవితం మిన్న అంటూ..
జ్ఞానోదయం కలిగించిన విద్యా జ్యోతి !
ఢిల్లీకి రాజైనా గురువుకు శిష్యుడే..
రేపటి తరం నిర్మాత సద్గురువు !
విద్యా దాహాన్ని పెంచే బోధకుడు..
తొలి అక్షరం దిద్దించిన గురువు !
శిష్యుడి తప్పటడుగుల్లో ఊత కర్ర
గురు సన్నిధి శీతల జ్ఞాన వృక్ష నీడ !
జ్ఞాన సమపార్జనకు ఆజ్యం పోస్తూ..
సాధారణ వ్యక్తిని మహోన్నత శక్తిగా..
మార్చగల మేధో సంపత్తి గని గురువు !
పుస్తక పాఠాలు నేర్పేది ఉపాధ్యాయుడు
విద్యతో జీవిత పాఠాలను జోడించి..
మహోన్నత వ్యక్తిత్వ వికాస నిర్మాత !
గురువు లేని జీవితం చమురు లేని దీపం
గురువును నమ్మిన శిష్యు పరమాణువు..
ప్రపంచాన్ని జయించగల శక్తివంతుడు !
గురువు బోధనలు ఆచరిస్తే విజయతీరం
గురువును పెడచెవిన పెడితే నరక తీరం !
గురుదైవాన్ని మొక్కితే జ్ఞాన ప్రసాద రుచి
గురువును హేళన చేస్తే మూర్ఖత్వ రోత !
'గురు'కులం పరమ పవిత్ర గ్రంథాలయం
గురు భాషణం జీవన విజయ భూషణం !

–మధుపాళీ
9949700037

## కాళోజీ నారాయణరావు కథల పుస్తకం ఆవిష్కరణ



కాళోజీ కథల పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, బాలాచారి, కవి యాకూబ్ తదితరులు.

తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రచురించిన పద్మభూషన్ కాళోజీ నారాయణరావు రచించిన కథల పుస్తకాన్ని రాష్ట్ర సాంస్కృతిక పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, కవి యాకూబ్, ఈమని శివనాగిరెడ్డి దినకర్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు స్ఫూర్తి సర్వేపల్లి రాధాకృష్ణన్



సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారం అందుకుంటున్న అయాచితం శ్రీధర్. చిత్రంలో జస్టిస్ నాగ మారుతి శర్మ, కళా జనార్ధనమూర్తి, బైస దేవదాసు, గీతాదేవి

హైదరాబాద్, సెప్టెంబర్ 10: పండితునిగా, ఆదర్శవంతమైన ఆచార్య స్థాయి నుంచి దేశ రాష్ట్రపతిగా ఉన్నత పదవికి చేరుకున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులకు స్ఫూర్తి ప్రదాత అని సీ.బీ.ఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతి శర్మ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతుల కార్యక్రమ పరంపరలో భాగంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సభను గరువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్యులు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేత డాక్టర్ అయా చితం శ్రీధర్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారం సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ నాగ మారుతి శర్మ ప్రదానం చేశారు. అనంతరం జస్టిస్ నాగమారుతి శర్మ మాట్లాడుతూ.. అయాచితం శ్రీధర్ తెలంగాణ సాహిత్య చైతన్య మూర్తి అని ప్రశంసించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడుగా ఆయన పదవీ కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల మౌలిక వసతులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు తగిన గ్రంథాలను అందుబాటులో ఉంచేందుకు చేసిన కృషి చిరస్మరణీయమని ఆయన అన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్రవహిస్తారని సన్మార్గంలో నడిచే ప్రతీ ఒక్కరికి ఉపాధ్యాయుడే ఆదర్శ గురువని బైస దేవదాసు అన్నారు. అలాంటి స్ఫూర్తి కలిగించిన డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారాన్ని సంప్రదాయ కుటుంబంలో జన్మించి ప్రగతిశీల భావాలు కలిగి ఎందరికో విద్య నేర్పి, యువతను చైతన్యపరిచిన డా॥ అయాచితం శ్రీధర్‌కు ప్రదానం చేయడం ఆనందంగా వుందని అన్నారు. శ్రీధర్‌కు అభినందనలు తెలిపారు.

ప్రముఖుల సేవలను గుర్తించి వారి జయంతి సభలను నిర్వహిస్తున్నామని సమాజంలో చైతన్యవంతమైన మార్పు రావాలన్న ఉద్దేశంతో గానసభ ఈ నిర్ణయం తీసుకుందని, డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా డా॥ అయాచితం శ్రీధర్‌కు పురస్కారం ప్రదానం చేశామని సభకు అధ్యక్షత వహించిన త్యాగరాయ గానసభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి అన్నారు.

ఎంతో మంది విద్యార్థులకు చదువు చెప్పిన శ్రీధర్‌ను కొనియాడారు.

పురస్కార గ్రహీత డా॥ అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ దేశం గర్వించ తగిన మహనీయుడు భారతరత్న రాధాకృష్ణన్ పేరిట అవార్డ్‌ను నీతి నిజాయితీకి ప్రతీకగా నిలిచిన న్యాయమూర్తి నాగమారుతి శర్మ చేతుల మీదుగా అందుకోవటం తన జన్మ సార్థకం అయ్యిందని చెప్పారు. ఈ సభలో గానసభ పాలక మండలి సభ్యురాలు గీతాదేవి పాల్గొన్నారు.

## విశ్వనాథ సత్యనారాయణ బహుముఖ ప్రజ్ఞాశాలి



సభలో ప్రసంగిస్తున్న డా॥ నాళేశ్వరం శంకరం.

హైదరాబాద్, సెప్టెంబర్ 10: విశ్వనాథ సత్యనారాయణ బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా॥ నాళేశ్వరం శంకరం అన్నారు. త్యాగరాయ గానసభ నిర్వహణలో గుండవరపు హను మంతరావు కళావేదికలో సోమవారం నిర్వహించిన రచయిత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.

విశ్వనాథ రచించిన వేదు పడగలు సుదీర్ఘ నవల నాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను ప్రతిబింబిస్తుందన్నారు.

ప్రొఫెసర్ శ్రీదేవి మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారా యణ కవి, కథకుడు, నవలా రచయిత, ఉత్తమ ఉపన్యాసకులని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు చక్రపాణి, శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నానీలు

అధిక వర్షం
ఉరుములు మెరుపులతో
జాడలేని
పెళ్లైన కప్పులు

ఊర్లన్నీ
కలువ కుండల్లా నీళ్లు
లబో దిబో మంటున్న
జనుల గోడు

చెరువులు
నడివీధుల్లో ప్రత్యక్షం
ఈత నెర్చుకుంటున్న
బండ్లు , పశువులు

వర్షంతో
అడవి స్నానం చేసింది
రేపటికి
చెట్టు పిల్లలు పెరగడానికి



–డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

## రజతం కాదు బంగారం



రజితా! నువ్వు లేకున్నా ఉన్నట్టే వుంది.
బ్రతుకంటే భయం లేదు నీకు
స్వార్థముంటే గదా!

ఉద్యమ జీవివి
జనం మనిషివి.
ఒంటరితనం లేదు నీకు
విశ్వకుటుంబినివి.

వ్యక్తిగతంగా
నీ మరణం నాకు అకస్మాత్ జ్వలనం.
నానీలు రాసి నన్ను గౌరవించావు
నోరారా నన్ను పప్పాజీ అని పిలిచే దానివి.
నేను కాకతీయ వి.సి.గా వున్నప్పుడు
అక్కడ ఉద్యోగినిగా వుండి కూడా
నన్ను కలవ లేదు.
అధికారులతో
నాకేం పని పప్పా అనే దానివి.
హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా
మా యింటికి వచ్చి
ప్రేమను వెదజల్లే దానివి
మాటలో సమత
మనసులో మమత

అదే నీ వ్యక్తిత్వ కాంతి.
సాహిత్య అకాడమీ "కవి సంధ్య"లో
ఎంత బాగా పాడావు
గొంతులో మధురిమలు
స్నేహంలో ఘుమఘుమలు.

చేతిలో
పూర్తికాని రాతలు ఎన్నో వున్నాయి
అప్పుడె తొందరపడి వెళ్ళిపోయావా తల్లీ!
ఎవరైనా ధైర్యం నీ నుంచే నేర్చుకోవాలి
నా మట్టుకు
నీ మరణం నాకు తీరని లోటు
వయోధిక జీవితంలో
తట్టుకోలేని వ్రేటు.

నువ్వు వెండివి కాదు
బంగారానివి
వీర మూర్ధన్యవు
ధన్యవు
క్షణం తీరిక లేకుండా బ్రతికావు
ఇకనైనా విశ్రాంతి తీసుకో.

(ప్రముఖ రచయిత్రి
అనిశెట్టి రజిత స్మృతిలో)



–డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

## తెలంగాణ తొలి పొద్దు కాళోజి నారాయణరావు

తల్లి (రమాబాయి) కర్ణాటక, తండ్రి (రంగారావు) మహారాష్ట్ర. వేర్వేరు ప్రాంతాలకు చెందిన వీరిద్దరికి పుట్టిన సంతానం తెలంగాణ తొలి పొద్దుగా కాళోజి నారాయణరావు ఉదయించాడు. మొదటి ప్రపంచ యుద్ధం (9.9.1914) తో పాటు నేను కూడా ఈ భూమి మీద పడ్డ అని నా గొడవలో కాళోజి చెప్పుకునే నేపథ్యం ఆసక్తిని కలిగిస్తుంది.

ఆయన పుట్టిన ఐదు,ఆరు నెలలకే తల్లి గర్భవతి కావడంతో, తనకంటే ఏడు సంవత్సరాలు పెద్దవాడైన రామేశ్వరరావు దగ్గర పెరగాల్సి వచ్చింది. 1996లో రామేశ్వరరావు చనిపోయినప్పుడు అన్నను గుర్తు చేసుకుంటూ, **"నేను నా ఆరవయేట మా అన్న భుజాల మీదికెక్కినాను. అతను మరణించేదాకా దిగలేదు. నేను అతని భుజాల మీదికి ఎక్కడం గొప్ప కాదు. 70 ఏళ్ల వరకూ అతను నన్ను దించకుండా ఉండడం గొప్ప"** అంటూ బంధాలకు,విలువలకు ఇచ్చే ప్రాధా న్యతని తెలియజేశాడు.

కాళోజి విద్యాభ్యాసం పాత మడికొండ, హన్మకొండ, హైదరాబాద్ ప్రాంతాల్లో కొనసాగింది. 1930 నుంచి గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొంటూనే తెలంగాణ లోని ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఉండాలని ఆకాంక్షించాడు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌తో అనుబంధం కలదు. బూర్గుల రామకృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, జమలాపురం కేశవరావు, పీవీ నరసింహారావు మొదలైన వారితో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు.

జీవితాంతం ప్రజాస్వామ్యవాదిగా ఉన్నాడు. **"నీ అభిప్రాయాల్ని స్వేచ్ఛగా ప్రకటించే నీ హక్కుల కోసం అవసరమైతే నా ప్రాణాలైనా ఇచ్చి పోరాడుతా"** అని ప్రకటించాడు. వివక్షను వ్యతిరేకించడంలో మంచిని స్వీకరించడంలో ఆయన ఎప్పుడు ముందుండేవాడు. నిజాం ప్రభుత్వంలోని రజాకార్ల దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ **"నవయుగాన నాజీ వృత్తుల నగ్ననృత్య మింకేనాళ్ళు**
**పోలీసుల అండను దౌర్జన్య శక్తులు పోషణ పొందేదింకెన్నాళ్లు"** అని గేయ రూపంలో నినదించాడు. ఈ గేయాన్ని నల్గొండ జిల్లాలో నిరక్షరాస్యులైన రైతు కూలీలు కలుపు తీస్తూ పాడిన సందర్భాలు కలవు. అదేవిధంగా **"అన్నపు రాశులు ఒకచోట/ ఆకలి మంటలొక చోట/ హంస తూలికలొక చోట/ అలసిన దేహాలొక చోట / సంపదలన్నీ ఒకచోట/ గంపెడు బలగం ఒకచోట"** అంటూ ఉన్నవాడి లేని వాడి మధ్య వ్యత్యాసాన్ని స్పష్టంగా వ్యక్తీకరించాడు. కాళోజి జీవితం, కవిత్వం రెండూ ఒకటిగానే పెనవేసుకొని ఉన్నాయి. జీవితంలోని ప్రతి సంఘటన కవితా దర్శనం ఇస్తుంది.

ప్రజలను పాఠకులను తన భావాల ద్వారా చైతన్యపరచడమే ఆయన కవితా లక్ష్యం.

కాళోజి గురించి శ్రీశ్రీ చెబుతూ
**"కాళోజీ నిఖిలాంధ్ర కవి. అందులో ఎట్టి సందేహం లేదు. అతనికి తెలంగాణా అంచులు గోడలుగా అడ్డునిలువజాలవు. అతను తన ఖండకావ్య సంపుటానికి 'నా గొడవ' అని పేరు పెట్టాడు. అదే కవి ప్రతిభ. అదే కవి చెప్పవలసిందీను. ఇది కవి గొడవగానే అనిపించినప్పటికీ చదివిన వారికి ఇది తమ గొడవగానే అర్థమవుతుంది. ఇది విశాల జగత్తు ప్రజలందరి గొడవ"** అని అన్నాడు. రాజకీయ నాయకుల ముందస్తు వాగ్దానాలు, ప్రజల నమ్మకాలను ఆధారంగా చేసుకొని ఆనాటి కాలంలో నాయకుల ఆధ్వర్యంలోని ప్రజల మనస్తత్వాలు ఏ విధంగా ఉండేవో విమర్శిస్తూ ఈ విధంగా అన్నాడు.

"అభ్యర్థి ఏ పార్టీ వాడో కాదు ఏ పాటి వాడో చూడు/
ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు ఇందాక ఏం చేశాడో చూడు/
**ఇప్పుడు కట్టే ముడుపులు కాదు ఇందాక చెల్లించింది చూడు/**
**పెట్టుకునే టోపీ కాదు పెట్టిన టోపీ చూడు"**
అని ప్రజాస్వామ్యాన్ని, ప్రభుత్వాలను ఎండగట్టాడు.

రోజు రోజు పెరుగుతున్న పోటీ తత్వాన్ని వివరిస్తూ
ఈ క్రింది విధంగా కవిత రూపంలో చెప్పాడు.
**"చాప చింపు - సామ్రాజ్యం/ కోడిగుడ్డు - కోహినూరు/ పాటి పన్ను- ప్లాటీనం/ బస్సు సీటు - బ్రహ్మరథం/ ఏదైతేం- ఏదైతేం/ పోటీపడికాటులాడ/ ఏదైతేం"** అని అన్నాడు.



ప్రజలు మూఢనమ్మకాలతో పీకల్లోతు పేరుకుపోయిన సందర్భంలో నిరక్ష రాస్యులను హెచ్చరిస్తూ
"ప్రతి చాదస్తం ఒక దేవుడే ఏదో ఒక రూపంలో గోకుడే"పేర్కొన్నాడు.

కాళోజీ దృష్టిలో భాష రెండు విధాలు
బడి పలుకుల భాష (గ్రాంథిక భాష), పలుకుబడుల భాష (వ్యవహారిక భాష). ఆయన పలుకుబడుల భాషకే ప్రాధాన్యత ఇచ్చాడు. ఆయన మానవతా దృష్టిని కనబరుస్తూ ఈ విధంగా అన్నాడు
**"ఉదయం కానే కాదు అనుకోవడం నిరాశ/ ఉదయించి అలాగే ఉండాలనుకోవడం దురాశ.**
**"హింస తప్పు/ రాజ్యహింస మరీ తప్పు'** అంటూ **"సామాన్యుడే నా దేవుడు"** అని ప్రకటించాడు.

కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయితగా ప్రఖ్యాతి గాంచాడు. అతని మరణానంతరం అతను పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేసారు.

తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షునిగానూ, 1977లో సత్తుపల్లి నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు కానీ జలగం వెంగళరావు పై ఓడిపోవడంతో రాజకీయ జీవితం ముగిసింది. కాళోజి చేసిన సామాజిక చైతన్య సాహిత్య సేవకు గాను అనేక పురస్కారాలు లభించాయి. అందులో ముఖ్యంగా

1972లో తామ్ర పత్ర పురస్కారం, 1968లో జీవన గీత రచనకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అనువాద పురస్కారం, 1981లో ప్రజాకవి బిరుదు,1992 లో భారత రెండవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మవిభూషణ్ పొందడంతో పాటు మరియు అదే సంవత్సరంలో కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ కూడా ప్రధానం చేసింది.

తనకు తాను తన వాస్తవిక జీవితాన్ని సామాజికానికి అనుసంధానం చేసుకుంటూ ప్రధాన కవితా లక్ష్యాన్ని చెబుతూ
**"కైత చేత మేల్కొల్పుకున్న కాళోజి కాయము చాలింక"** అని ప్రతిజ్ఞ చేశాడు. **"అన్యభాషలు నేర్చి/ ఆంధ్రంబు రాదంచు/ సకిలించు ఆంధ్రుడా! చావవేటికిరా"** అని మనల్ని ఏనాడో హెచ్చరించిన అసలైన తెలుగోడు కాళోజి. లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ మరణించినప్పుడు నివాళులు అర్పిస్తూ **"పుట్టుక నీది/ చావు నీది/ బ్రతుకంతా దేశానిది"** అని అన్నాడు, కానీ అది ఆయనకే వర్తిస్తుంది. తెలంగాణ భాషా దినోత్సవం (కాళోజి జయంతి) సందర్భంగా కాళోజి సిద్ధాంతాలను గుర్తు చేసుకుంటూ బ్రతుకంతా దేశ ప్రజల కోసం అర్పించిన ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయం అనే భావన చిరస్మరణీయం.



–గడ్డం లింగస్వామి
9010081146.

# “తెలంగాణ ఝురి పంచాక్షరి”

భావోద్వేగమే కళకు జీవం. జాతిభాష ప్రాంతం దేశం భావోద్వేగాలకు బాటలు వేస్తాయి. భావోద్వే ప్రసారాలకు కవిత్వం ప్రబలమైన ప్రక్రియ. పద్యం కావొచ్చు. పాటకావొచ్చు. స్వేచ్ఛాకవిత కావచ్చు. కవిత్వ రూపాలన్నీ మానవ సహజమైన భా వోద్వేగాలకు రాగాలు కూర్చి హృద యాల్లో ముద్రవేస్తాయి.

అస్థిత్వ చైతన్యం వెల్లువెత్తినవుడు ప్రాంతీయ భావోద్వేగాలు ప్రకంపన లు సృష్టించిన సందర్భాలు చరిత్ర నిండా కనిపిస్తాయి.

స్వాంతమేకానీ ప్రాంతమేకానీ తెలంగాణ కవుల హృదయాల్లో కల్లో లం రేపింది. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ సంబంధమైనా తెలంగాణ రైతాంగపోరాట సందర్భమైనా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమమైనా, మలిదశ తెలంగాణ రాష్ట్ర మహోద్యమమైనా కవుల కలాల్ని గాయకుల గళాల్ని పదునెక్కించాయి.

పందొమ్మిదివందల తొంభయి ఆరులో మొదలై రెండు వేల వద్నాలు గులో రాష్ట్రం సాధించుకున్న తెలం గాణ ప్రత్యేక ఉద్యమ చరిత్ర వీరోచి తమైంది.

వ్యూహాత్మకమైనది. కల పలించి సాకారమైన ఇటీవలి ఒకే ఒక ఉ





ప్రతులకు:డా॥పాండాల మహేశ్వర్, ఇ.నెం. 1-53, , గౌస్‌కొండ ఇ.నెం.13-29ఎం, ప్రకాష్‌నగర్ కాలనీ, భూదన్‌పోచంపల్లి-508 284 సెల్: 9912180054

జయశంకరుల పలుకుల ప్రవాహం, పదిజిల్లాల పరిస్థితులు, గతవైభవం, ప్రస్తుత దైన్యత కేసిఆర్ దీక్ష, ఓయూ జేఏసీ, ఉద్యమ ఉధృతి పార్లమెంటులో లొల్లి రాష్ట్ర అవతరణ, రాష్ట్ర స్వపరిపాలన, పునర్నిర్మాణం, అపరిష్కృతసమస్యలు ఇట్లా వరుసల దీర్ఘప్రయాణం దశల దశలు గా అల్లుకునే విశేషాలుచరణ చరణుగా

స్ఫూర్తి, చరిత్ర స్ఫూర్తి.

**“కాకతీ రుద్రమ్మ**
**కదనపాండితినెంచి**
**కవులు గాయకులూతమిచ్చే..**
**దండిగా**
**రచనవైతాళికులు కదిలే..**
**మొండిగా**
**వంటవార్పులు జేస్తువాసిగా ముందుండె**
**ధూముధాములదర్వు దూకుల్ని పెంచారు”** (14).

తొలుత కదిలింది జయశం కరుడే. మరికొందరు మేధావులే, కొన్ని సంఘాలే తర్వాతే కేసీఆర్, తెరాస రాజకీయ పక్షాలు. ఉద్యోగసంఘాలు జేఏసీలు వీళ్ళందరిని ఉడుకెత్తించిన కవులు, కళాకారులు

పాటలు వంటవార్పు ఒక చరిత్ర, ధూంధాం మరో చరిత్ర. అన్ని కలగలిసిన ఉద్యమ సన్నివేశాలన్నీ మహేశ్వర్ కవిత్వంలో అక్షర రూపం దాల్చాయి.

**“వలసపోయెటి జనులు పాల మూరు ఘనులు”**, మెదకు జిల్లా లయలు మంజీర పరవళ్ళు, మెట్టపంటలసాగు నిజాము బాదు జిల్లా.. ఇలా వరుస ఉద్యమంలో ఉడుకెత్తిన పది జిల్లాల పరిస్థితులు ప్రకంపనలు కవిత్వీకరించాడు కవి. నల్లగొండ మరింత పదునెక్కిన జిల్లా కవి స్వంతజిల్లా

**“నీలగిరుల జిల్లా**
**నియమాల తోరణం**
**విప్లవనాదాల గడ్డా.. నల్గొండ**
**ఎర్రబిడ్డలకిదియె అడ్డా..”** (32)

వరుస చరణాలు, భావావేశాలు, ప్రజల కోపతాపాలు, డాక్యుమెంటరీ చందాన కళ్ళముందు, సాగిపోతుం టాయి.

నడుమనడుమ సెల్లు ఫోనొకటాయె “సిమ్ములరడజనాయె” వంటి విసుర్లు ఊగుతుంటాయి. పార్టీ భేదాలున్నా పట్టింపు తెలంగాణ అయి జడుపు లేకుండా పోరాడినారు గనుక ఇరవై తొమ్మిదో రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని మహేశ్వర్ వర్ణిం చాడు. తెలంగాణ సాకారమైన తర్వాత పునర్నిర్మాణ దశలు కూడా వరుసగా ఏ కరువు పెట్టాడు కవి. కవుల ఉత్సాహం ప్రత్యేకం.

**“బతుకమ్మ బోనాలు**
**ప్రభుత పండుగలాయె**
**తంగేడు పువ్వేమో రాష్ట్ర పుష్పంబై విరిసే.. (131)**
**ఎర్రకోటలజండ**
**గోల్కొండ నెగిరింది...”**

సంవేదనయినా, సంబురమైనా కవి పట్టలేదు పలుకుల్లో మెరువవల సిందే.

పాండాల మహేశ్వర్ సంబు రాలు చరణాల్లో మెరుస్తున్నాయి. భావో ద్వేగాలు, భాషలో ఇముడక పోవచ్చు, కవిది సతతం ఇమిడ్చే ప్రయత్నం.

**“నాకు నడతలునేర్పే**
**నా తల్లి ఈనేల”**

ఒక వాక్యం చాలు.కవిని పల వరించడానికి. కవి పలవరింతలు వివేచించడానికి పాండాల మహేశ్వర్ గేయ కావ్యంలో ఇట్లాంటి వాక్యాలు పరవళ్లు తొక్కుతుంటాయి. కావ్యం శ్రావ్యంగా తీర్చినందుకు అభినం దనలు.

మహేశ్వర్‌కు తెలంగాణ మీద గౌరవం, యాదాద్రి నరసన్నమీద అభి మానం, కవిత్వం మీద ఎనలేని ప్రేమ. గేయం తన ప్రాణం. తెలం గాణ మీద కావ్యాలు చాలానే వచ్చా యి. కొన్ని ఉద్యమవేళ, కొన్ని నిర్మాణ వేళ.

ఎటొచ్చి కావ్యమంతటా తెలం గాణ పరిమళాలే. పదపదాన దూళికాంతులే. పాండాల మహేశ్వర్ పంచాక్షరీ ధ్వనులు ప్రజల గుండెల్లో ప్రతి ధ్వనించాలి పదాలు రవళిం చాలి. పరిమళించాలి.

**డా॥ పాండాలమహేశ్వర్ “పంచాక్షరి” తెలంగాణ ఆధునిక గేయం పుస్తకానికి డా॥ నందిని సిధారెడ్డి రాసిన ముందు మాట ఇది..**

ద్య మం. అన్ని వర్గాల ప్రజల హృదయాలను ఆకట్టుకున్న తీరు అద్భుతం. ఉద్యమంలో నాయకుల పాత్ర, మేధా వుల పాత్ర, కవి గాయకుల పాత్ర విశేషమైంది. తెలంగాణ వదవే గొప్ప భావోద్వేగం, హృదయోత్తేజం.

తెలంగాణ ఉద్యమ ఘట్టాలను ఉత్తేజంగా, ఉద్వేగంగా డాక్టర్ పాండాల మహేశ్వర్ మనస్సుప్పొంగి వర వళ్ళు త్రొక్కిన కావ్యం **“పంచాక్షరి”.**

మునుల భక్త శిఖామణుల పంచాక్షరీ అందరికీ తెలిసిందే. ఇది కవి మహేశ్వర్ స్వరధనుల “పంచాక్షరి”. ఇది ఆధునికం వర్తమాన కాలాన్ని గెలిచి ఆలింగనం చేసుకున్న తెలంగాణం కవి గానం.భారతదేశ సంస్కృతి భిన్న సంస్కృతుల మేళవిం పుల సమ్మేళనం ఆంధ్రప్రదేశ్ అవతరణం, ఆదిపత్యాలు, అణచివేతలు, తెలంగాణ వాదం, ప్రత్యేక తెలంగాణ, మలిదశ తెలంగాణ రాష్ట్ర భావన, దాశరధి

రచించాడు మహేశ్వర్.

**“తెలగాణ వాదమ్ము నరనమ్మున సాగ**
**రక్తపాతముచిందప్రభుతా.. అణచింది**
**హింసతానూజేసి తొక్కే.. బలముగా**
**రగిలింది విప్లవం సెగలు సెగలుగలేచి**
**మూడొందలరవయ్యి తొమ్మిదియు బలికాగ..”** (9)

ఇది 1969 ప్రత్యేక తెలంగాణ చరిత్ర. ఆదిపత్య అణచివేతలకు విశేష అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజ్జ్వరిల్లిన ఉద్యమం. 369 మందిని బలిగొన్న జ్ఞాపకం గేయం చరణంలో మహేశ్వర్ ఆవిష్కరించారు.

మలిదశ ఉద్యమానికది స్ఫూర్తి 69ని తిరిగేస్తే 96. అప్పటి విద్యార్థులు యువకులు తరువాత ఉద్యమానికి నాయకులు, నిర్ణాయకులు. అప్పుడు ఉద్యమాన్ని సమర్థించిన కవులు సాహసికులు కొందరే.

మలిదశపోరు అట్లాకాదు. కవుల హోరు గాయకులజోరు పాటల



**-ఆచార్య నందిని సిధారెడ్డి**
పూర్వ తెలంగాణ సాహిత్యఅకాడమీ ప్రథమాధ్యక్షులు

## సప్తపదులు...!



**-డా॥గన్నోజుశ్రీనివాసాచార్య**
8555899493

భక్తి
యుక్తి
త్రికరణశుద్ధిగా
చేస్తే దొరకదా
ఇక ముక్తి!

జలము
హలము
ఉంటేనే
రైతు పండించె
పంటలకు
బలము!

తలపు
మలపు
మనసులు
ఒక్కటి
అయితేనే
నిల్చేది
వలపు!

ఉద్యోగము
ఉద్వేగము
క్రమశిక్షణతో
పనులు చేస్తేనే
చంచలంలేని
మహాయోగము!

పద్యము
హృద్యము
నవరసాల
కావ్యం
వైవిధ్యపంచభక్ష్యాల
నైవేద్యము!

చెట్లు
గట్లు
పర్యావరణ
పరిరక్షణకు
జీవతతికి
ప్రాణమున్న
మెట్లు!

అందం
చందం
ఆకర్షణలో
పడితే చాలు
వదలదు
బంధం!

## నానీలు

కడలిలో పడవ
అలలతో గొడవ
విజయతీరమే
పోరాట లక్ష్యం

నీది నాది ఏదీ లేదు
తెలిసినా
మాయలో
బతకడమే జీవితం

**-గద్దం సులోచన**
7702891559

## తీర్పు

**“రేపు 31. అంటే నెలాఖరు. ఈనెల ఒక్క పెట్టీ కేసయినా మున్సిఫ్ కోర్టు కెళ్ళలేదు. ఎందుకున్నారు ఇంత మంది ఏద్వనా! మిమ్ముల్ని దొంగల మేపినట్టు.. థూ థూ ఒక్కడూ పనిచేయడు. కనీసం మీరు తీసుకునే జీతమన్నా వంటబట్టాలా రేపీపాటికి రెండు కేసులన్నా కోర్టుకు పోకుంటే ఏమవుతుందో తెలుసుగా!**

అది సెంటరు. అక్కడ పోలీస్‌స్టేష నుంది. కాపలా కానిస్టేబుల్స్ ఉన్నారు. అది పౌర రక్ష కార్యాలయం. అక్కడికి డబ్బు దర్పం, హోదా ఉన్న పైక్లాస్ పైరవీకార్లు వస్తుంటారు. వద్దన్నా సిల్కు లాల్చీలలో నోట్లు కుక్కుకొని మెట్టెక్కుతారు మరోరకం జనం “మేం రాంనాయినో” అని మొత్తుకున్నా రక్షకభటులు లాక్కొస్తారు అన్యాయం, న్యాయం అప్పుడప్పుడు తారసపడు తాయి. రాత్రి పది గంటలయింది. మొదటి సినిమా వదిలారు. రోడ్డు మీద షిఫాన్ చీరలు మెర్క్యురి దీపాలకు మెరుస్తున్నాయి. గాజుల గలగలలు, మల్లెపూలవాసన, బ్రాంది, నాటుసారా మిక్స్‌డ్ వాసనతో, కుర్రకారు ఈలలతో రోడ్డు హడావిడిగా ఎలక్షన్లో పోటీ చేసే నాయకుడిలా ఉంది.నిషాలో ఉన్న ఇన్‌స్పెక్టరుకు కాంతం, కనకం ఇద్దరే జ్ఞాపకం వచ్చారు. ఈరోజు 30, రేపు 31, అంటే నెలాఖరు, టేబిల్‌మీద రిజిష్టర్ గబగబా తిప్పేశాడు. ‘థూ! థూ!’ అని విసుక్కున్నాడు.

ఏయ్ “303” పిలిచాడు.

‘జీసాబ్’ స్విచ్‌వేయగానే లైట్ వెలిగినట్లే వచ్చాడు ఎర్రటోపివాలా.

“హెడ్” కిధర్‌గయే?”

“సాబ్ అందర్! అందర్” నాటుసారామాటలు తడబడ్డాయి.

“తెలుగులో ఏడ్వు” విస్కీ తాగిన గొంతు గర్జించింది.

“వసంత విహార్‌లో ఓ నయాపిట్ట వచ్చింది సాబ్, దాన్ని పట్టుకొచ్చా” హెడ్‌బాబు. 342 ఇద్దరు. “అదిగో హెడ్‌బాదూ అదీ అందులో” ఓ

**“చెప్తాం దొరా! నిన్న మా దొర వరికుప్ప గొడితే పదిళశేర్ల వడ్లగింజలు కూలేశాడు. అయ్యి కోంటి బిడ్డకిస్తే మూర్రూపాయలిచ్చె. మాతోటి జీతగాల్లంతా మొన్నరాత్రి బాలనా గమ్మ సిల్మాచూసి బాగుందంటే మేమూసూద్దామని బుద్ది పుట్టి వచ్చాం సామి. సిల్మా చూశాం. తెల్లారుగట్ట లెగాలంటు నాకేమో మేలుకవ్వదు. బస్సులకాడ పండుకుందామని మా మల్లిగాడంటే ఆడికెళ్లాం. ఆడ రేకులకింద మా పసునూరు పంతులు గారు పన్నారు. ఆయన పక్కనే పడు కున్నాం దొరా! ఇక గీ పోలీసోల్లు, మద్దెనేత్రికాడి రెండు బేటరీల యెలు గులు మా ముకాన ఏశారు. మేము గిల్లున లేచి చూస్తిమి. ఏవూరంటే చెప్పాం. సిల్మా కొచ్చామని చెప్పాం. “చలో భే పోలీస్ స్టేషన్” కని గుంజు కొచ్చి రాత్రికొట్లో వేశారు. గింతే మా తప్పు”**

నవ్వు నవ్వి లాకప్ రూంవైపు చూపించాడు.

“ఏడిశావు ఇదేమన్నా! స్టేషనా! సానికొంపా” బాగుంటుందా,

ఒకేసారి కోపాన్నీ, దాంతో కుతూహలన్నీ వెల్లడించాడు

“దాని బొంద, ఎన్ని చేతులు



మారి...” కానిస్టేబుల్ చెప్పాడు.

“అది సరేగాని...” అధికారి కంఠం గొణిగింది.

20 రూ॥లు అధికారికి ముట్టాయి.

ఇంతేనా అన్నట్టు చూసిందా ముఖం కోపంతో.

“దాన్నేంత అడిగినా ఇంతే వచ్చాయని చెబుతుంది సార్”

“ఈ రోజు తారీకు”

“ముప్పయి” అతివినయంగా పలికాడు.

“రేపు 31. అంటే నెలాఖరు. ఈనెల ఒక్క పెట్టీ కేసయినా మున్సిఫ్ కోర్టుకెళ్ళలేదు. ఎందుకున్నారు ఇంత మంది ఏద్వనా! మిమ్ముల్ని దొంగల మేపినట్టు.. థూ థూ ఒక్కడూ పనిచేయడు. కనీసం మీరు తీసుకునే జీతమన్నా వంటబట్టాలా రేపీపాటికి రెండు కేసులన్నా కోర్టుకు పోకుంటే ఏమవుతుందో తెలుసుగా! ఎల్లుండి డియస్‌పి గారి ఇన్‌స్పెక్షన్” ఇన్‌స్పెక్టరు పరిస్థితులు వివరించాడు. ఎర్రటోపి తల ఊపాడు. ఒక్కసారి లైట్లన్ని ఆరి పోయాయి. క్షణంలో మళ్లీ వచ్చాయి. మల్లెపూలు ఇన్‌స్పెక్టర్ చేతిలోకి వచ్చాయి. సైకిల్ మోటారు స్టార్టయింది. అధికారం అంధకారంలో కలిసి పోయింది.

రెండో రోజు. అంటే 31 సరిగ్గా 10 గం॥లకు యల్లయ్య, మల్లయ్యలను, మరి ఇద్దరు రిక్షావాళ్ళను ఎర్రటోపీ వాలా మెజిస్ట్రేటు ముందు హాజరు పరిచాడు. లైటులేకుండా రాత్రి పూట రిక్షానడిపినందుకు రిక్షావాళ్ళకు చెరి మూడు జరిమానా వేసిపంపాడు మెజిస్ట్రేటు. “మల్లయ్య, యల్లయ్యలు ఇద్దరు అనుమానితులుగా కోర్టుకు తీసుకువచ్చారు. రాత్రి బస్‌స్టాండ్‌లో ఓ ఘరానా వ్యక్తి ప్రక్కన పడుకున్నారని దొంగతనానికే నీళ్ల అక్కడ చేరారని రక్షక భటులు విన్నవించుకున్నారు” మెజిస్ట్రేట్ విన్నాడు.

మల్లయ్య, యల్లయ్యలను మెజిస్ట్రేటు “నిజంగా దొంగతనానికి వెళ్ళారా? దొంగలేనా?” ప్రశ్నించాడు. యల్లయ్య మాట సవరించుకున్నాడు. సిన్నోల్లం అచ్చరం ముక్కరానోల్లం ఎల్లను పొదుచుకుంటూ అస్తమానం కష్టం చేసుకుంటోల్లం”

“నిన్నీ సోది చెప్పమన లేదు” కానిస్టేబుల్ మందలించాడు.

“నీవు మాట్లాడకు, వాళ్ల చెప్పేది చెప్పనీ” మెజిస్ట్రేటు కసిరాడు వాళ్ల మాట్లాడే భాష వినాలని విచిత్రంగా సినిమాలో మాటలాగా ఉన్నాయని మెజిస్ట్రేటనుకున్నాడు.

“ఊ” కానీ

“చెప్తాం దొరా! నిన్న మా దొర వరికుప్ప గొడితే పదిశేర్ల వడ్లగింజలు కూలేశాడు. అయ్యి కోంటి బిడ్డకిస్తే మూర్రూపాయలిచ్చె. మాతోటి జీతగాల్లంతా మొన్నరాత్రి బాలనా గమ్మ సిల్మాచూసి బాగుం దంటే మేమూసూద్దామని బుద్ది పుట్టి వచ్చాం సామి. సిల్మా చూశాం. తెల్లారుగట్ట లెగాలంటు నాకేమో మేలుకవ్వదు. బస్సులకాడ పండు కుందామని మా మల్లిగాడంటే ఆడికెళ్లాం. ఆడ రేకులకింద మా పసునూరు పంతులు గారు పన్నారు. ఆయన పక్కనే పడు కున్నాం దొరా! ఇక గీ పోలీసోల్లు, మద్దెనేత్రికాడి

**నాటి తరం వారి కథలు నేటి తరానికి**
**కథల వంతెన**

రెండు బేటరీల యెలు గులు మా ముకాన ఏశారు. మేము గిల్లున లేచి చూస్తిమి. ఏవూరంటే చెప్పాం. సిల్మా కొచ్చామని చెప్పాం. “చలో భే పోలీస్ స్టేషన్” కని గుంజు కొచ్చి రాత్రికొట్లో వేశారు. గింతే మా తప్పు” వాల్లిద్దరి కండ్లలో నీళ్ల తిరిగాయి.

చదువుకున్న ముఖాలన్ని మాటలు విని సంతోషించాయి.

మెజిస్ట్రేటు బుర్ర గోక్కున్నాడు.

“రూల్స్ ప్రకారం చెరి మూడు రూపాయలు జరిమానా వెయ్యాల్సిస్తుంది” మెజిస్ట్రేటన్నాడు.

“పైసల్లేవు దొరా” చిరిగిన జేబు చూపించాడు.

“లేకుంటే వారం రోజులు జేబులు” తీర్పులు చెప్పి మెజిస్ట్రేటు వెళ్లిపో యాడు.

“జేయిలనేవరకూ, యల్లయ్య మల్లయ్యలకు ముచ్చెమటలు పోశాయి. నెత్తి మీద పిడుగు పడ్డట్టయింది.

ఎర్రటోపి చూపులు మల్లయ్య ముంజేతి వెండికడెం మీద పడ్డాయి. తీసిచ్చాడు మల్లయ్య.

క్షణంలో కడెం అమ్ముకొచ్చి జరిమానా చెల్లించి, వాళ్లకు బస్ ఛార్జీలిచ్చి, మిగిలినవి జేబు ఖర్చులకుంచుకున్నాడు కానిస్టేబుల్. బస్తీని తిట్టుకుంటూ మూడోరోజు యల్లయ్య మల్లయ్యలు యిల్లు చేరుకున్నారు.

మూడోనాడు ఇన్‌స్పెక్షన్ చేసిన డి.యస్.పి. ఇన్‌స్పెక్టరు కృషి సభినందించాడు. పెట్టిన కేసుల లిస్టు చూసి తృప్తి పడ్డాడు.

ఓ ఘనమైన పార్టీ ఏర్పాటు చేసుకున్నాడు. అందరు మత్తుగా తాగాక డి.యస్.పి. ఓ కొత్త విషయం చెప్పాడు. ‘మన ఇన్‌స్పెక్టర్ గారి కృషి ఫలితం త్వరలో ప్రమోషన్ వస్తుంది. తాగిన చేతులు చప్పట్లు కొట్టాయి. బల్లలు చరిచాయి.

**(1972లో రాసిన కథ)**



**-మేరెడ్డి యాదగిరిరెడ్డి**
9949415798

## కవితార్చన



అడ్మిన్: **డా॥రాధాకుసుమ**
సెల్:99892 41319

“కుసుమ ధర్మన్న కళా పీఠం” సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
-సంపాదకులు

### దివ్య స్వరూపాలు

అక్షరం మంత్రాత్మకం
సంగీతం -సాహిత్యం
సరస్వతీ మాత దివ్య స్వరూపాలు..
అక్షరం క్షరము కానిది!
సంగీతం లయాత్మకం..
ప్రణవ నాదము నుండి సామవేదం..
సామవేదం నుండి సప్త స్వరాలు..
సప్త స్వరాలు నుండి సంగీతం
అనుగ్రహించబడిన అద్భుతాలు!
పదలాలిత్యం.. శబ్ద సౌందర్యం
మధుర భావతరంగాలు..
చక్కని సంగీతానికి..సాహిత్యం
తోడైతే..
మధుర భావ జలపాతం ధారాధరమై..
హృదయాలను ఆహ్లాద పరుస్తాయి!
శిలలను కరిగించే శక్తి సంగీతానికి ఉంది!
శిశుర్వేత్తి.. పశుర్వేత్తి.. వేత్తిగానం ఫణి: అన్నారు పెద్దలు!
అద్భుత పదసంపదతో ఎదలోతులు మీటి..
భావ సౌందర్య మధురిమలతో ఓలలాడిస్తుంది!
సంగీత సాహిత్యాలు సమ్మోహనాస్త్రాలు!
అక్షరాస్త్రాలు హాస్యతు షారాలు!
పరమేశ్వరుడు అందించిన దివ్య వరాలు!

**-దబ్బ భాస్కరరావు**
94902 90045

### ఈ చిరు కానుక

ఓనమాలు దిద్దించే అక్షర బ్రహ్మ!
ఏమిచ్చి ఋణం తీర్చుకోవాలి ఈ జన్మ!
ఆ శిల్పి చేతిలో చెక్కిన బొమ్మలం,
బతుకు పుస్తకమంతా వారి ఆనవాళ్ళే !
జీవితాన్ని ముందుకు
నడిపే రథసారథులే !
ప్రపంచాన్ని చూపించే యోధులే వారు.
బలపం పట్టిన చేతుల్లో
అక్షర దోషాలు దొర్లితే ఆ
చేతులపై వాతలు పడతాయి
ఆ వాతలు పడ్డ చేతులను
నైపుణ్య సాధనాలుగా తీర్చిదిద్దగల
సమర్థులు గురువర్యులు.
ఓ గుప్పెడు ఆలోచనలు,మెదడున
కొన్ని అక్షర సుమాలు చేతిరాతలో
కదలాడుతున్నాయంటే ఆ అక్షరాల
మాంత్రికులు, ఆ ఆచార్యదేవులు
నేర్పిన అక్షర కణికలే కారణం.
యుగాలుగా నుండే కొనసాగే
గురుశిష్యులు అనుబంధం,
జ్ఞానదీపాలు వెలిగించడం
ఆ వెలుగులో మనం తరించడం
ఆ మహనీయుల ప్రియవచనాలు
నా మానస క్షేత్రమందు చెరగని
తరగని ముద్రవేసాయి.

**-లయన్ సంధ్య**
83414 53113

### మధురానుభూతులు

జ్ఞాన జ్యోతి పంచే శిల్పులు ఉపాధ్యాయులు
అంధకారంలో వెలుగులు నింపే కాంతిదారులు.
మన హృదయాల్లో ఆత్మవిశ్వాసానికి విత్తనాలు
సంకల్పాలకు నేర్పిన వీరే నిజమైన మార్గదర్శకులు.
ఒక మాటతోనే ఆశలను రగల్చే శక్తి,
ఒక చూపుతోనే ధైర్యాన్ని నింపే మహిమ.
వారి సహనమే మనకు బలప్రధానం
వారి కరుణే మన జీవన ధ్యానం.
కాలం గడిచినా జ్ఞాపకాలలో నిలువగా
వారి ఉపదేశం ఎల్లప్పుడూ వెలుగుగా.
కష్టాల దారిలో తోడుగా నిలిచే నీడ
భవిష్యత్‌నే మలిచే సుశ్రావ్య వీణ.
ఉపాధ్యాయుని పాదాల వద్దే నిజమైన తపస్సు
ఆశీర్వచనమే జీవితానికి శాశ్వత ఒయాసిస్సు.

**-డా.భరద్వాజ రావినూతల**
+91 98662 03795

### విచక్షణ రథసారథి

గురువు ఎవరు
ఏమున్నదతని చెంత అనిన
ఓ మనిషి నిర్వచన శిల్పి అతడు
సంస్కారం,సభ్యతల
రథసారథి అతడు.
రంగు రూపం అందం ఉన్న
అందరు కన్నార్పక చూస్తారు
అదే సంస్కారం సభ్యతలు ఉన్న
అందరు మిన్నగా అభినందిస్తారు.
ఎలా బతికావన్నది ముఖ్యం కాదు
నల్గురిలో
ఎలా జీవించావన్నది ముఖ్యం
గురువు అడుగుజాడల మసలిన
నలుగురి మెప్పు నిండుగ పొందేవు
పదుగురి గౌరవం మెండుగ అందేవు.
ఆస్తిపాస్తులు బౌగోళిక సంపదలు
సంస్కార సభ్యతలు కీర్తి ప్రతిష్టలు
గురువు చూపిన గమన గమ్యం
నువ్వది ఛేదిస్తే చిరంజీవి నీ నామం.
పరిచయాలతో పదవులు దక్కేను
ప్రమాణాలతో అభిమానులు చిక్కేను
పదవులతో తాత్కాలిక ప్రయోజనాలు
అభిమానుల ఆర్జిస్తే శాశ్వత గౌరవాలు
చరిత్ర రాయు గురువు నేర్పిన బాటలు.
ఆశ ఆశయ గమ్యాలు మనుగడ రథాలు
సంస్కార సభ్యతలు ఆ రథసారథులు
సహజమైన మనషి
సమాజాన్ని వెంబడిస్తాడు
సంస్కార సభ్యతలన్న మనిషిని
సమాజం వెంబడిస్తుంది
గురువుల ఆశ్రయంలో
సంస్కారం సభ్యతలు నేర్చుకో
తిరుగులేని కీర్తి అందిస్తుంది
సభ్య సమాజం
చరిత్రలో మాయని
విలువైన పుట దక్కుతుంది
విశ్వాన చిరస్థాయిగ నిలిచే
ఆశీర్వచనం గురువు

**-డా దీపక్ న్యాతీ**
9849488837

### ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలు

గోరు ముద్దలతో చందమామను
చూపే అమ్మ
గుండెల పైనే అడుగులు నేర్పే నాన్న
జీవిత పాఠ శాల లో తొలి గురువులు
జీవన సాఫల్యతకు దారులు.
అక్షరాలు దిద్దించే రూపం
అజ్ఞానాన్ని పారదోలే దీపం
జ్ఞాన జ్యోతులు వెలిగించే దైవం
త్రిమూర్తుల స్వరూపం గురువే.
గోవిందుడు గురువుల్లో
తొలి నమస్కారం
దేవుణ్ణి చూపిన గురువుకే అన్న
కబీరు సంస్కారం
మానవ విజ్ఞానికి అలంకారం.
ఆట పాటల అల్లరి ప్రాయం
తోటి విద్యార్థుల తగవుల బాల్యం
గురువులు నేర్పిన విద్యే జీవనం
గురుపూజోత్సవం నాడు
గురు స్మరణ జీవిత భాగ్యం.

**-విజయ రాజు**
+91 99482 87225

## తాబేలు తెలివి



నరసింహపురం గ్రామ పొలిమేరల్లో ఒక కొలను ఉండేది. అనేక జీవులు వచ్చి అక్కడ తమ దాహం తీర్చుకునేవి.ఇలా ఉండగా అక్కడికి కొత్తగా ఒక మొసలి వచ్చి చేరింది.అది చేపలను తినడం ప్రారంభించింది.అది గమనించిన చేపలు తాబేలుతో తమను మొసలి బారి నుండి కాపాడమని వేడుకున్నాయి .

తాబేలు సరేనని ఒక రోజు ఆ గ్రామంలో ఉన్న ఊర కుక్కల వద్దకు వెళ్లి “ఓ గ్రామ సింహాల్లారా! మా కొలనుకు ఒక క్రూరమైన మొసలి వచ్చి ఈ కొలనులోని జీవులన్నింటిని తన ఆహారం కొరకు చంపుతున్నది. మేము ఎంత బ్రతిమిలాడినా అది వినడం లేదు. చిన్న ప్రాణులం.మేము దానిని ఏం చేయగలం? అందుకే మీ సహకారం కొరకు ఇక్కడికి వచ్చాను. దయచేసి ఆ మొసలి బారి నుండి మమ్మల్ని కాపాడండి”అని వేడుకొంది. ఆ కుక్కలు అందుకు సరేనన్నాయి.

తాబేలు మళ్లీ కొలనుకు ఏమీ ఎరగనట్లు తిరిగి వచ్చి చేరింది. కానీ మొసలి దానిని గమనించి ఇంతసేపు ఎక్కడికి వెళ్లావని ప్రశ్నించింది. అప్పుడు తాబేలు మొసలితో “ఓ మొసలి మామా!నన్ను ఈ రోజు కొన్ని ఊర కుక్కలు అడ్డగించి “ నీవు, ఆ మొసలి నీటిలోనే ఉండాలి. మీరు బయటకు వస్తే మేము ఊరుకోం. ఈ సంగతి మీ కొలనులోని మొసలికి కూడా చెప్పు”అని అంది. అది విన్న మొసలి “ఓ తాబేలా! మీరు భయపడకండి. ఈ కొలను బయట మనం తిరగడానికి అడ్డు చెప్పడానికి వాటికేం అధికారం? “అని అంది.

అది విన్న తాబేలు మొసలితో “ అలాగైతే నీవు మాకు రాజువు.మమ్మల్ని కాపాడాల్సిన బాధ్యత కూడా నీదే! రేపు మన కొలనుకు ఆ కుక్కలు వస్తానన్నాయి. నీవు వాటిని ఇక్కడికి రాకుండా చెయ్యి” అని చెప్పింది. అది విన్న మొసలి కోపంతో “ అవి రానీ! నీటిలో నా బలం ముందు వాటి బలం ఎంత? ఆ అడవి క్రూర మృగాలనే నా నోటితో నీటిలోకి లాగి చంపుతాను. ఇవి నాకొక లెక్కా!” అని అంది. తన పాచిక పారుతున్నందుకు ఆ తాబేలు ఎంతో సంతోషించింది .మరునాడు కొన్ని ఊర కుక్కలు ఈ కొలనుకు వచ్చాయి. అవి ఒడ్డు పైననే ఉండి ‘భౌ, భౌ’మని ఆ మొసలిని చూసి మొరగసాగాయి. అప్పుడు ఆ కొలను చెట్టుపైన ఉన్న పక్షులు ఆ మొసలితో “ఓ మొసలి మామా! ఆ కుక్కలను ఈ కొలను ఒడ్డుపై నుండి బయటకు తరిమికొట్టు. వాటి అరపులు మేము వినలేక పోతున్నాము”అని అన్నాయి. ఆ మొసలికి రోజూ నీటిలో నుండి బయటకు వచ్చి అటూ, ఇటూ తిరగడం అలవాటు. ఏదైనా చిన్న జంతువు తన ఆహారానికి దొరుకుతుందేమోనని దానికి ఆశ. కానీ అది కుక్కల భయానికి బయటకు రావడానికి భయపడింది. తన భయం సంగతి ఇతర జీవులకు తెలి యకుండా ఉండడానికి ఆ మొసలి “ఓ కుక్క లారా! ఈ కొలను బయట మీకేం పని? మీరు ఈ నీటి లోనికి రండి. మీ సంగతి చూస్తాను” అని అంది. అప్పుడు ఒక కుక్క **“ఓ మొసలీ! నీవే బయటకు రా! నీ పని మేము పడతాము”** అని అంది. ఆ సాయంత్రం ఆ కుక్కలు అక్కడి నుండి వెళ్లి పోయాయి.

కానీ మరుసటిరోజు ఉదయం మళ్లీ ఆ కుక్కలు వచ్చాయి.అవి మొసలిని చూసి మొరగడం ప్రారంభించాయి. ఇక ఇక్కడ లాభం లేదని అనుకున్న మొసలి ఆ సాయంత్రం ఆ కుక్కలు వెళ్లిపోగానే వెంటనే ఎవరికీ చెప్పకుండా అక్కడి నుండి వెళ్లి పోయింది. ఆ తాబేలుతో పాటు చేపలన్నీ ఆ కుక్కలకు ధన్యవాదాలు చెప్పాయి. ఆ చేపలు తమను మొసలి నుండి కాపాడిన తాబేలును, కుక్కలకు తమ ధన్యవాదాలు తెలిపి ఆ తాబేలు తెలివిని మిక్కిలి ప్రశంసించాయి.

**-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
9908554535



## ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శనం



పురస్కార గ్రహీతలతో అతిథులు

హైదరాబాద్, సెప్టెంబర్ 10: ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శమని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం త్యాగరాయ గానసభలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించి మాట్లాడారు. సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ సర్వేపల్లి తత్త్వ శాస్త్రంలో ఎన్నో గ్రంథాలు, వ్యాసాలు రాశారన్నారు. తొలుత ‘ఆచార్య దేవోభవ’ అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొని స్వీయ కవితలను చదివి విన్పించారు. కార్యక్రమంలో ప్రముఖులు రామ్మోహన్‌రావు, కోలేటి దామోదర్, దైవజ్ఞశర్మ, శాంతికుమారి, కృష్ణవేణి, రాధాకుసుమ, మురళీమోహన్‌రాజు, కొండూరి హరినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





**ఆహ్వానం**

పేరూరు బాలసుబ్రమణ్యం కవితా సంపుటి
**‘ఉగ్గుపాలనుండే...’**
**ఆవిష్కరణ సభ**

**13 సెప్టెంబర్ 2025**
శనివారం ఉదయం 09.30 గం॥లకు
వేదిక : వేమన విజ్ఞాన కేంద్రం, యశోదనగర్, తిరుపతి.

నిర్వహణ
యువశ్రీ మురళి డా॥ నెమిలేటి కిట్టన్న శ్రీ మల్లారపు నాగార్జున
**అభ్యుదయ రచయితల సంఘం & వేమన విజ్ఞాన కేంద్రం**
**తిరుపతి జిల్లా శాఖ.**

నాటి తరం వారి కథలు నేటి తరానికి

**కథల వంతెన**

# బేవఖూఫీ (కథ)

–సయ్యద్ ఖుర్షీద్,
సెల్: 8096555386

1990లో రాసిన కథ



జోహర్ నమాజు అయిపోయింది. మజీదు నుండి ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. అందులో ముందుగా వచ్చిన కరీం, మజీదు ఎదురుగా ఉన్న తన ఇంటి అరుగుల మీద కూర్చున్నాడు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహించిన ఇటీవలె రిటైర్ అయ్యారు. ఇప్పుడు నమాజు చదువుతూ అల్లాస్మరణలో కాలం గడుపుతున్నాడు. కరీంతో పాటు మరికొందరు సహోద్యోగులు నమాజు అనంతరం ఆ అరుగులపై కూర్చొని కాలక్షేపం చేస్తుంటారు. ఆ కాలక్షేపం మాటల్లో ప్రపంచమంతా వారిచుట్టే పరిభ్రమిస్తు ఉంటుంది. ఎప్పటి లాగానే నమాజు అనంతరం ఒక్కొక్కరుగా వచ్చి వెళ్తూ అప్పుడు ఆ దారిన పోయే ఏ వ్యక్తి కనిపించినా పండుగే వారికి. అందుకే ఆ దారి వెంట వెళ్ళాలన్న ఆ టైంలో చాలా మంది సంతోషిస్తుంటారు.

సరిగ్గా.. అప్పుడే అటువైపుగా వస్తున్న రహీం కనిపించాడు వారికి! వీళ్లను చూసిన రహీం ఎవరో తరుముకొస్తున్నట్లుగా, వీరిని గమనించనట్లుగా వేగంగా ముందుకు సాగారు.

''అస్సలామలైకుమ్. రహీం భాయ్! మందలించాడు కరీం.

'వాలెకూమ్ అస్సలామ్!' వంచిన తల ఎత్తకుండానే ముందుకు పోబోయారు.

'క్యా రహీం సాబ్! బేపార్ కైసా హై భాయ్?॥ ఈసారి ఎక్బాల్ ప్రశ్నించాడు.

అల్లాకా ఫజల్ హై ఇక నిలబడక తప్పలేదతనికి.

'బజార్ ఎలా ఉంది? ఏం జరుగుతుంది భాయ్?" మళ్ళీ అడిగాడు కరీం. 'ఎన్నికలొస్తున్నాయి కదా! అంతా అదే హడావుడి కనిపిస్తుంది. పోటీలో చాలామంది పేర్లు వినిపిస్తున్నాయి. పోటీ తీవ్రంగానే ఉండేలా వుంది.

'ఏంటీ! సర్పంచ్ పదవికి మనవాళ్లూ పోటీ చేస్తరా?!' నమ్మలేనట్లు అడిగాడు కరీం.

'తప్పేముంది. మనవాళ్లంతా ఒకటిగా నిలబడి పోటీచేస్తే సర్పంచ్‌ను గెలిపించుకోలేమనా! ఊర్లో మనకు బాగానే ఓట్లున్నాయి కదా! ఈసారి అలీం మాట్లాడారు (సంభాషణలు అన్ని ఉర్దూలోనే) 'ఎందుకులేవు. దాదాపు ముప్పై శాతానికిపైగా మనవాళ్లే ఉన్నారు. కాని మనలో అంత దమ్మున్నవాళ్లున్నారా? ప్రతీసారి ఎన్నికల ముందు ఎన్నో పేర్లు విన్పిస్తున్నాయి. కాని పోటీ చెయ్యడు ఒక్కడు.

'పోనీ.. ఈసారి మీలో ఎవరైనా పోటీ చెయకపోయారా"? కావాలనే అడిగాడు రహీం మాకెందుకు బాయ్.. ఆ రొచ్చు అందరి తరపున బదులిచ్చాడు కరీం.

'అచ్చా.. మైc చాల్తా హూc!' అన్నం తిని మళ్ళీ షాపుకెళ్లాలి. అంటూ ముందుకు సాగాడు.

అక్కడి వారంతా మాట్లాడుకోవడానికి ఒక టాపిక్ దొరికింది. వారి మధ్య వాదోపవాదాలు, ఫర్మానాలు దొర్లిపోతున్నాయి. అసర్ నమాజ్ వేళ వరకు.

రెండు రోజుల తర్వాత.. యథా ప్రకారం అందరూ అక్కడ కొలువుతీరిన వేళ.. అస్సలామలైకుమ్ అంటూ వచ్చాడు మక్దూం. 'వాలైకుమ్ అస్సలామ్'... ఏక కంఠంతో అందరన్నారు. 'ఈ సారి జరిగే ఎన్నికల్లో నేను మన వార్డునుంచి పోటీ చేస్తున్నాను..

**ఈవార్డులో ముస్లిం ఓట్లే కీలకం. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ముస్లింలే. ఎలాగూ వాళ్ళ ఓట్లు చీలిపోతాయని తెలుసు నాకు. అదే కలిసొచ్చింది. నేనే కేవలం మన వాళ్ల ఓట్లపైనే దృష్టి నిలిపాను. నాకు పోటీగా ఉన్న మా వాళ్లను ఉపసంహరింపచేశాను. అంతా నేననుకున్నట్లే జరిగింది.**

మీరందరు నన్ను ఆశీర్వదించాలి. ఎలాగైనా నన్ను గెలిపించాలి'.. సూటిగా విషయంలోకి వచ్చాడు" ఏ పార్టీ నుండి పోటీ చేస్తున్నావు..?' ఆరా తీసాడు ఎక్బాల్..

మార్క్సిస్ట్ పార్టీ.. నేను మార్క్సిస్టు పార్టీలో పని చేస్తున్న విషయం మీకు తెలియనిది కాదుగా?!

పార్టీలో ఇంతవరకు నాకు ఏ పదవీ లేకున్నా ప్రజల కోసం పనిచేస్తూనే ఉన్నాను. ఎందరికో ఎన్నో పనులు చేసిపెట్టాను. మన వార్డు అభివృద్ధిలో పాటు పడుతున్నాను. ఈ రోజు పార్టీవారు అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. మీరందరూ సహకరిస్తే తప్పక గెలుస్తానన్న నమ్మకం ఉంది'

మక్దూం భాయ్! ఈసారి ఎంత మంది పోటీలో ఉంటారో? యింకా ఏమీ తేలనేలేదు కదా!' మనవాళ్లు చాలా మంది పోటీల్లో ఉండేలా ఉన్నారు. అన్ని పార్టీలు కేడా ఈ వార్డుకు పోటీ నిలబట్టే సూచనలు కనిపిస్తున్నాయి. మన ఓట్ల కోసం అది తప్పనిసరి అవసరమని ఆహ్వానిస్తుంటారు. ఇప్పటికే నా ప్రత్యర్థుల జాబితా పేర్లు డజను దాటిపోయింది. ఇంకోవారమైతే, ఇంకా ఎక్కువవుతాయి. ఏది ఏమైనా ఎంతమంది పోటీలో ఉన్నా, నేనుపోటీలో ఉండడం కాయం. అందుకే 'ముందస్తు'గా మీ ముందుకొచ్చాను. నాకు మీ 'దువా' కావాలి. అని మనసులోని మాటను అందరి ముందు ఉంటాడు మక్దూం. 'నీకు మా దువా లేనిదెప్పుడు భాయ్! ఎల్లప్పుడు ఉంటుంది ఇక్బాల్ అన్నాడు. 'కానీ ఎక్కువమంది పోటీ చేయడం కంటే, మంచి వారు ఒకరిద్దరే పోటీ చేస్తే బాగుంటుంది కదా' తన అభిప్రాయం చెప్పాడు కరీం.

ఎవరు చెప్పాలి? సందేహంగా అన్నాడు అలీం. 'మీ వంటి పెద్దలే చెప్పాలి. అందరికి అర్థమయ్యేటట్లుగా నచ్చచెప్పాలి. అనవసరపు పోటీని నివారించాలి.. మక్దూం.

ఇంకా టైముందిగా, ఆలోచిద్దామీ విషయం..ఎంత, ఇంకా పది రోజులేగా! ఆలోచించండి. నాకు మీ చేయూతనివ్వండి. ఈ వార్డును అభివృద్ధి చేయిస్తాను. మరోసారి అడిగాడు మక్దూం. ఆలోచిద్దాం.. అందరి తరపున బదులిచ్చాడు ఇక్బాల్.

'నమాజ్ కా వఖ్త్ హెూ రహాహై! ముందుకు నడిచాడు కరీం. మిగిలిన వారంతా అతన్ని అనుసరించారు.

తర్వాత అవే అరుగుల మీద, అందరూ ఆసీనులైన సమయాన.. భాయ్ ఎలక్షన్స్ వస్తున్నాయి. ఏం చేద్దాం? నాంది పలికాడు ఎక్బాల్. ఎవరికో ఒకరికి ఓటు వేయాల్సిందేగా బదులుగా కరీం అన్నాడు.

ఎందుకు అంటే అడిగాడు అలీం. ఈసారి పోటీ తీవ్రంగా ఉంది. మనవాళ్లే ఈ వార్డు చాల మంది పోటీలో ఉన్నారు. అన్ని పార్టీల అభ్యర్థులు ముస్లింలే! వీరికి తోడు మరో పదిపన్నెండు మంది అయ్యారు, నామినేషన్లు అయిపోయేలోగా ఎంత మంది అవుతారో కూడా వివరించాడు కరీం. 'అలా అయితే ఎలా?' అందరిని కూర్చోబెట్టి నచ్చ చెప్పొచ్చు కదా ఎక్బాల్ నీ పిచ్చి గానీ ఈ రోజుల్లో మన పిల్లలే మన మాట వినడం లేదు వాల్లింటారా? అనవసరంగా మన పెద్దరికాన్ని పోగొట్టుకోవడం తప్ప అది కుదరదు అని అలా ఎక్బాల్, కరీంలు మాట్లాడుకుంటున్నారు. మిగతావాళ్లు వింటున్నారు. ఆందోళన నిండి స్వరంతో అడిగాడు ఎక్బాల్.

ఈ పోటీలో తొమ్మిది మందున్నా తీవ్రమైన పోటీ మాత్రం ఇద్దరులేదా ముగ్గురి మధ్య ఉంటుంది మిగతావాళ్లు. మహా అయితే తమ తమ కుటుంబాల ఓట్లు పడతాయేమో!

అయినప్పటికీ మన ఓట్లు చీలిపోతాయి కదా? మనమేం చేయలేమా? ఎందుకు ఎక్బాల్ భాయ్! మనందరం కలిసి మౌలానాను నిలబెట్టి గెలిపించుకుందాం. అతను మన మనిషి ఐదుసార్లు నమాజ్ చదువుతాడు. మన మాట వింటాడు. మనతోటే ఉంటాడు. ఇంతకంటే మంచివాడెవ దున్నాడు. బరిలో...' మెల్లిగా తన పథకాన్ని బహిర్గతం చేశాడు.

'మౌలానా మంచివాడే. కానీ ఏ పార్టీ సపోర్ట్ లేకుండా గెలుస్తాడంటరా?"సందేహంగా అడిగాడు సలీం.

'మనకు పార్టీలెందుకు? మనందరం ఒక్కటైతే

**మన ఓట్ల కోసం అది తప్పనిసరి అవసరమని ఆహ్వానిస్తుంటారు. ఇప్పటికే నా ప్రత్యర్థుల జాబితా పేర్లు డజను దాటిపోయింది. ఇంకోవారమైతే, ఇంకా ఎక్కువవుతాయి. ఏది ఏమైనా ఎంతమంది పోటీలో ఉన్నా, నేనుపోటీలో ఉండడం కాయం. అందుకే 'ముందస్తు'గా మీ ముందుకొచ్చాను. నాకు మీ 'దువా' కావాలి. అని మనసులోని మాటను అందరి ముందు ఉంటాడు మక్దూం.**

చాలదూ. మనం చెప్తే మనవాళ్లు వినరా! మౌలానాను గెలిపించుకోలేమా?" బదులిచ్చాడు.

'మరి మక్దూం సంగతేంటి? వాడు ఎప్పటి నుంచో దీన్నే నమ్ముకుని ఉన్నాడు కదా? ఇప్పటికీ ఎన్నో పనులు చేశాడు.అందరికంటే ముందు మనల్ని కలిశాడు' అడిగాడు సలీం.

'ఎన్నికల ముందు అందరూ వస్తారు.. మన బలం తెలిసినవాడు కాబట్టి మక్దూం ముందుగా మనల్ని కలిశాడంతే! పైగా వాడు గెలిచినా, ఓడినా పార్టీ కోసమైనా పనులు చేయక తప్పదు. అసలు వాడు ఎప్పుడయినా మసీదుకొచ్చాడా? రంజాన్, బక్రీద్ పండుగలకు తప్ప. ఆజ అవుతుంటే మసీదు ముందునుంచే వెళతాడు తప్ప మసీదుల్లోకి రాడు. అలాంటివాడ్ని మనమెలా గెలిపిస్తాం..? ఒకవేళ వాడు గెలిస్తే ముస్లింలంతా మార్క్సిస్టులనే ముద్ర పడిపోతుంది. ఆలోచించండి అంతా! వివరించాడు కరీం.

'వాడు గెలిస్తే.. గెలిస్తే.. ముస్లింలంతా మార్క్సిస్టులెలా అవుతారు? మక్దూం గురించి అంతా మరోసారి ఆలోచిద్దాం..!' అడిగాడు ఎక్బాల్.

'ఇంకా ఆలోచించేదేముంది? కరీంభాయ్ చెప్పిందే కరెక్టుగా ఉంది. మనతో పాటే అల్లా స్మరణలో ఉన్న మౌలానాను కాదని మక్దూంను గెలిపించాల్సిన అవసరమేముంది? అడిగాడు అలీం.

అలీం అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లు తలలూపసాగారందరూ. ఇక్బాల్‌కు ఇక మౌనం వహించక తప్పలేదు.

ఇక చర్చలు మౌలానాను ఎలా గెలిపించుకోవాలి. ఎలా ప్రచారం చేయాలి. పోటీకి ఎలా ఒప్పించాలి అనే కోణంలో సాగాయి.

మూడువారాలు తర్వాత,..

ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడ్డాయి. అటు మౌలానా, ఇటు మక్దూం ఇద్దరిలో ఎవరూ గెలవలేదు. ఎవరూ ఊహించని విధంగా ఎన్నికలలో రవి విజయం సాధించాడు. రవి శిబిరంలో ఒకటే ఉత్సాహం. విజయోత్సవ వేడుకల ఘనంగా జరుపుకుంటున్నారు.

'నీ గెలుపు ఎలా సాధ్యమైంది?' రవిని ఎవరో అడిగారు.

"వెరి సింపుల్! ఈవార్డులో ముస్లిం ఓట్లే కీలకం. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ముస్లింలే. ఎలాగూ వాళ్ళ ఓట్లు చీలిపోతాయని తెలుసు నాకు. అదే కలిసొచ్చింది. నేనే కేవలం మన వాళ్ల ఓట్లపైనే దృష్టి నిలిపాను. నాకు పోటీగా ఉన్న మా వాళ్లను ఉపసంహరింపచేశాను. అంతా నేననుకున్నట్లే జరిగింది.

విజయం నన్ను వరించింది. వివరించాడు రవి.

ఇదేమీ పట్టని ముస్లిం పెద్దలు ఎప్పటి మాదిరిగానే మసీదులో నమాజ్ చదివి ఎదురుగా ఉన్న కరీంభాయ్ ఇంటి అరుగులపై కూర్చునే ఉన్నారు. యధావిధిగా కాలక్షేపం చేస్తూనే ఉన్నారు. మగ్ధూమ్ తన పార్టీ పనుల్లో తీరిక లేకుండా తిరుగుతూనే ఉన్నాడు. మౌలానా క్రమం తప్పకుండా మసీదుకు వెళ్తూనే ఉన్నాడు. ఆ వార్డులోని మెజార్టీ ముస్లాంలు ఎప్పటిమాదిరిగానే ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

*(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)*

---



ఈ వారం అంశం: పిచ్చివాళ్ళు
పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.
2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 32 కు మొత్తం 21 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 4 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

–డా॥రావి రంగారావు
9247581825

## వచన కవితలు

ఎవరు ఈ పిచ్చోళ్ళు!

సృష్టి స్థితి లయల్లో
బతుకు చిత్రం తెలియక
మూణాళ్ల ముచ్చటకే
మురికి మురిసి చస్తున్నారు!

నేను నాదంటూ
అర్రులు చాచి అహం వీడక
సుఖ దుఃఖాల సాగరంలో
మునగ లేక తేలలేక
మాయాజాలంలో చస్తున్నారు!

ఏమీ లేదని, ఏమీ రాదని
ఉదయించిన కిరణమే అస్తమించి చెబితే
అందీ అందని ఆశల కోసం
అలుపెరగక ఉరుకులు పెట్టి
వెర్రివారిలా చస్తున్నారు!

సమాజమే దేవాలయ మని
ప్రాణు లన్నీ ఒకటే నని
ఆత్మ దర్శనం చేసుకోలేక
దారుణంగా మారణంగా
ఒంటరి వారై చస్తున్నారు!

పంచభూతాలని పంచేంద్రియాలని
శ్వాసించి ఆస్వాదించి
మంచితనానికి మార్గం వేయక
ఏమి కట్టుకు పోదామని
స్వార్థాలను క్రోధాలను
ఆహ్వానించి చస్తున్నారు! .

విధి విదిల్చిన జీవులు
జ్ఞాన జ్యోతిని వెలిగించి
మనసు మర్మం తెలుసుకోక
అజ్ఞానపు చీకటిలో
అలమటించి చస్తున్నారు!

–చల్లా సత్యవతి

పచ్చనోటు ఎరకి ఓటు ఆయుధాన్ని అప్పగిస్తూ
మసకబార్చుకుంటున్న జీవనాల్లో
వెలుగుకే వెంపర్లాడుతూ
తమ వేలితో తమ కన్నే పొడుచుకుంటున్న
ఓటర్లు పిచ్చోళ్ళు...
అనురాగాలు గంగ పాలు చేసినా
అవమానాస్త్రాలతో రక్త సిక్తం చేసినా
కంటి పాపల వెలుగుకై కొవ్వొత్తిలా కరుగుతూ
కడగంటి చూపూ కరువై నేల కొరుగుతున్న
కన్నవారు పిచ్చోళ్ళు ...
వికసించని కుసుమాలకూ పరిమళాలు అద్దుకోవాలని
సాహితీ వనంలో వటవృక్షమై వేళ్లూనాలని
ఉవ్విళ్ళు ఊరుతూ
కాళ్ళని అరగిస్తూ, కాసుల్ని కరగిస్తూ
అవార్డులకై అర్రులు చాచే పిచ్చోళ్ళు...
వెర్రి మొర్రి అర్థాటాల పూనకాలతో
రీల్స్, ట్రోల్స్ లనే పారవశ్యాలతో తేలిపోతూ
ప్రాణాలనే నైవేద్యంగా అర్పిస్తున్న
సోషల్ మీడియా పిచ్చోళ్ళు...
మానవత్వంతో మసిలితే పిచ్చోళ్ళు,
నిర్భయత్వంతో వెలిగితే పిచ్చోళ్ళు,
ఆధ్యాత్మిక వైరాగ్యాలతో మునిగితే పిచ్చోళ్ళు,
మానసిక దౌర్భాగ్యాలతో మెలిగితే పిచ్చోళ్ళు...
అరిషడ్వర్గాల మేలి ముసుగులో చిక్కుకుని
చిత్త భ్రాంతుల్లో చిత్తవుతూ
నిత్యం మాయలలో భ్రమిస్తూ,
పరిభ్రమిస్తున్న
మనుషులంతా పలు రకాల పిచ్చోళ్లే.

–మేడిశెట్టి సుభద్రా కృష్ణ

## ఊబి

ఆకలితో ఏడిస్తే
తల్లి చనుబాలు పడుతుంది అనుకొనే చిన్నారి పిచ్చివాడు,
బోసి నవ్వులు నవ్వుతుంటే తల్లితండ్రులే
ముద్దాడుతారనుకొనే బిడ్డ పిచ్చివాడు,
జాబిలినీ చూపిస్తూ నేతి అన్నము తన తల్లే
తినిపిస్తుంది అనుకొనే బుజ్జోడు పిచ్చివాడు,
ఆరు బయట మంచము మీద తాత కథలు వింటూ
నిదుర పోవాలి అనుకొనే బాలుడు పిచ్చివాడు...
బండెడు పుస్తకాలు మోయకుండా పలకా బలపము పట్టుకొని
బడికి పరిగెత్తాలని తలచే విద్యార్థి పిచ్చివాడు,
డ్రిల్లు పీరియడులో ఆరుబయట ఆటలాడుకోవచ్చు అని
తలచే పాపడు పిచ్చివాడు,
ఉత్తర దక్షిణాలు అంటే దిక్కులు అని ఇంటర్వ్యూ లో
ధీమాగా చెప్పే ఉద్యోగార్థి పిచ్చివాడు,
లంచము తీసుకుంటే కంచము కరువు అవుతుంది
అనుకొనే ఉద్యోగి పిచ్చివాడు,
ఓటు వేసి గెలిపించిన తమ నాయకుడు
సహాయము అడగంగానే చేస్తాడు అనుకొనే వాడు పిచ్చివాడు,
సర్కారు దవాఖానాలో అన్ని ఉచితము అని నమ్మి
అక్కడ చేరదలచు కొనే రోగి పిచ్చివాడు...
కల్తీ చేస్తే యమలోకంలో బాధపడాల్సి వస్తుందని తలచి
నిక్కచ్చి వ్యాపారము చేసేవాడు పిచ్చివాడు,
నైతిక విలువలు గల వాడనుకొని ఒకే పార్టీలో
ఉండదల్చుకొనే రాజకీయ నాయకుడు పిచ్చివాడు,
అమెరికాలో పెళ్ళాడిన కొడుకు ఆఖరి చూపుకు వస్తాడని ఆశపడే తండ్రి పిచ్చివాడు...
ఐటమ్ సాంగులు లేకుండా సినిమాలు తీసి
స్త్రీకి గౌరవమివ్వాలి అనుకొనే నిర్మాత పిచ్చివాడు,
చివరకు ఈ పిచ్చి ప్రపంచములోకి ఎప్పుడు కాలు పెడదామా అనుకొని
తల్లి పొట్టను రోజు తన్నే గర్భస్థ శిశువు
ఊబిలోకి దిగ బోతున్న నిఖార్సు అయిన పిచ్చివాడు.

–పూసపాటి

## పిచ్చివాడు

అవును నిజమే..
అతను పిచ్చివాడు
ఎవరికీ అంతగా నచ్చని వాడు..!.

స్వార్థం ఎరుగనివాడు
సాటి మనుషులంటే..
గుండె నిండా మమకారాన్ని నింపుకొని సాగేవాడు
చెఱకుగడలాంటి మనసున్నవాడు..!!.
అతను ఎప్పుడు నిజాన్ని గౌరవించేవాడు
నిజాయితీగా బతకాలనుకొనేవాడు.

అబద్ధానికి ఆమడ దూరంవుండే వాడు..
చీకటి దారులకు చిక్కని దీపము వంటివాడు..!!.
మోసమనే మాట ఎరుగనివాడు
చెప్పుడు మాటలకు
చెవియొగ్గని వాడు
ఎవరిబతుకుతో కూడా

చెలగాటం ఆడాలని
ఆశ పడనివాడు..
సామాజిక రుగ్మతలకు
చేదుమాత్రం వాడు..!.
అసూయ ద్వేషం..
కుళ్ళు కుతంత్రాలతో సాగే నేటి లోకానికి,..
సరిపడనివాడు వాడు
అందుకే వాడు పిచ్చివాడు.
ఎవరికీ అంతగా నచ్చనివాడు .

ఎస్. ముంతాజ్ బేగం

---





నిర్వహణ
–కందుకూరి శ్రీరాములు
–బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం – కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

## నటిస్తూ....

ఓపెన్ హార్ట్ చెప్పేదంత నిజమేనంటు.
పాల తెలుపులో నీరుల.
అసత్యాన్ని నమ్మిస్తున్నవి
లౌక్యం నిండుబట్ట కప్పుకొని నటిస్తూ.
ప్రతి మాట ఖరీదై.
తూకం వేసుకుంటు.
లాభాపేక్షకై స్వీయ రచనలు.
నమ్మలేని నిజాలు కొన్ని.
నమ్మించలేని సత్యాలు ఎన్నో
లోకంలో సమస్యలుకోకొల్లలైన
వార్తలకు అవి పనికిరానివే.
ఆక్రమణలను లికించని
సిరా చుక్కలు చీకటి తొవ్వలు.
వెతుక్కుంటున్నవి.

మౌనం కొన్ని సందర్భాలలో
మేలే చేస్తుంది అనుకున్న అవసరం
ఉన్నచోట అక్షరం నోరు మెదపక
మాకెందుకులే అనుకునే మేధాతనం
నేటి వార్తా కథనాలు వర్తమానం
వార్త భవిష్యత్తుకు
చరిత్రగ నిలుస్తదనేది మరిచిన
స్వీయ ప్రయోజనాల కై అవాస్తవాలను
వాస్తవాలుగ వాస్తవాలను అవాస్తవాలుగ
చిత్రించే సామాజిక కథనాలు
వార్త ఒకప్పుడు జనంనోటి మాటగ.
లోకాన్ని చుట్టి చైతన్యాన్ని ప్రేరేపించేది
నేడు నల్లధనం పోషించే.
దత్తపుత్రులై ముద్దకు
మద్దెల ధరువై వంతపడుతున్నాయి

–యరకల యాదయ్య.
9866468979.



## ఓయీ కాలమా!

ఏనాటిదో ఈ కాలము
ఎవరు నాటిరో ఎరుగము
కాల కంచెను కాంచగలమా
ఎంత దూకిన దాటలేమా!.
ఎన్ని మడతల వల
దాగిన జీవుల చరిత్ర లోపల
తేలిపోతి అమాయక భ్రాంతుల
తెల్లారిపోయే రేపటి కల !.
వెలుగులో కనిపించని
చీకటెంత దాగెనో
మనసులో చెప్పలేని
అనుభూతులెన్ని దాగెనో !.

ఉదయమైతే మురిశాను
వెలుగులో తెగ మెరిశాను
పారిజాతమై పరిమళించాను
పురి విప్పిన మయూరినై నర్తించాను!.
అయినా
ఎదదలో ఏదో ఒక నిర్వేదం
ఎడతెగని ఒక సిద్ధాంత వాదం
అంతులేని వాదాల వాదోపవాదం
అవనిలో నిత్య కొత్త
నినాదాల వినోదం!.
ఓయీ కాలమా!
నీ ప్రవాహం లో యుగాలను
ముంచావు
నీ ప్రవాహ కొలతలను
రాత్రింబవళ్ళు గా మలిచావు!.

కనిపించని కాలమా
నీవు
ఆగని జీవుల వాహనమా
నీకెవరు లేరు బంధువులు
మాకే బవబంధాలు !.
తిరుగుట పెరిగి
విరుగుట కాలమా
నీవేగూటిలో తిరుగుచున్నావో
ఆ గూడు నిగూఢ శూన్యమా
అక్కడ కాలము స్తబ్దమా!.
కాలమా నీవెంత విచిత్రమోయీ
నీది ఎండమావుల గారడి
వెలుగుల ఆకర్షణ లో పడి
మేము శలబాలై రాలిపోవాలా!

–పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## శంభు ! నీ చిత్రాలు అసంపూర్ణంగానా?

చిత్రకారులెవరైనా చెప్పా పెట్టకుండా కుంచెలూ
రంగులు భుజాన వేసుకోని ఆకాశమార్గాన పయనమై
పోతారా ఖాళీ కాన్వాసులు గదిలో వదిలేసి!
అవి ఏమై పోవాలి!
తెల్లబోతూ ఉండాల్సిందేనా!
వన్ మాన్ షో నీ యొక్క ఆర్ట్స్ ఎగ్జిబిషన్ చూసే అభిమాన
ప్రేక్షకుల ముఖాలు వివర్ణమేనా!
కవిత్వమూ రాసేవాడివి కదా
కలమూ మూసేసి పోయావ్!!
ఇదేమి అకాల చిత్ర పయనం !
రంగులు గడ్డకట్టి పోయాయి
వందేండ్లు మా దగ్గర ఉండి
ప్రపంచమంతగా చిత్రాలను వేసేవాడివి కదా
ఇదేమి చిత్రమైన ముగింపు !!??

–కందాళై రాఘవాచార్య
8790593638

(ఇటీవల హఠాత్తుగా మరణించిన ప్రముఖ చిత్రకారుడు, కవి కె.శంభు కోసం సంస్మరణ కవితా పుష్పం )

## నగరదారి – గోదావరి

మెల్లమెల్లగాను మల్లన్న సాగరం
నడిచి వచ్చుచుండె నగర దరికి
గొంతునింపుకొరకుగోదావరిజలాలు
కనుమ వినుము దారి కందుకూరి.

ముక్కుమూసుకుంటు మురికి మూసీనది
నట్టనడుమ పరమ నగర కంపు
గండిపేట నీళ్ల దండిగా పారునా
కనుమ వినుముదారి కందుకూరి

–కందుకూరి శ్రీరాములు
సీనియర్ తెలుగు లెక్చరర్
తపస్య డిగ్రీ కాలేజ్
సికింద్రాబాద్

---



1988లో రాసిన కథ

# సత్యం

''సత్యం సత్యం'' కేకలేసుకుంటూ పాఠశాలలో ప్రవేశించాడు మేస్టారు సుబ్బారావు.

అతనిలాల్చి చమటతో తడిసిపోయింది. జుట్టురేగిపోయింది. ముఖం ఎర్రబారింది.రోజు ప్రసన్నవదనంతో వచ్చే మాస్టారు ఈ రోజు కేకలేసుకుంటూ రావడం, వచ్చీ రావడంతో బెత్తాల కోసం వెదకడం చూసిన విద్యార్థుల గుండెల్లో గుబులు మొదలయింది.కుర్చీ మీద కూర్చున్న సుబ్బారావు పాఠశాల అనబడే పశువులపాక చూరుకువున్న బెత్తం లాక్కున్నాడు. ఆ పాకలో రాత్రి పశువులుంటాయి, పగలు బడిపిల్లలుంటారు.

"ఎక్కడ చచ్చాడ్రా సత్యం..." పిల్లలవైపు చూసి అరిచాడు.

ఎదురుగా నేలమీద చింకిచాపల మీద కూర్చున్న భావిభారత పౌరులనబడే పిల్లలు ఒకరి ముఖం ఒకరు అయోమయంగా చూసుకున్నారు. భయం బయంగా మేస్టారు చేతిలోని బెత్తం చూడగానే ఆ పసిపాపల ముకాలు చెమటలు పట్టాయి. కండ్లు కొట్టుకుంటూ నోటమాటరాక వలకలు బలపాలు పట్టుకుని మాష్టారువైపే చూస్తూ కూర్చున్నాడు.

"ఒరేయి సత్యం.." మూడోసారి అరిచాడు మేష్టారు భయానికో, చింత బెత్తం భయానికో అది తన శరీరం మీద చెసె దద్దుర్లను తలచుకుంటూ సగంచచ్చిన పాములా అడుగులో అడుగు వేసుకుంటూ కుర్చీ సమీపించాడు సత్యం. అల్లంత దూరం వుండగానే సత్యం రెక్కపుచ్చుకున్నాడు మేష్టారు.

"పిలుస్తుంటే నీకు గాదు హంసనడక.." వీపు మీద ఒకటి వేశాడు.

"అమ్మో!" వీపు రుద్దుకుంటూ గెంతులేశాడు సత్యం.

**రెండు మూడు రోజుల కోమారు పాఠశాలకు రావడం, ఎటెండెన్స్ వేసుకోవడం, అప్పుడప్పుడు సర్పంచ్‌గారు తనూ విందు చేసుకోవడం, నెలనెలా ఠంచనూగా జీతం తీసుకోవడం సుబ్బారావు మేష్టారుగారి పని. పిల్లలు బడికి రావడం, ఓ గంటసేపు కూర్చోవడం, పలకలు పుస్తకాలు తీసుకుని వెళ్ళడం పిల్లలపని.**

"ఏరా!నిన్న వచ్చిన ఇన్‌స్పెక్టర్‌తో ఏమి చెప్పావు" గద్దించాడు.

"సార్" వస్తున్న కళ్ళ నీళ్ళను చిరిగిన చొక్కా తొడుచుకున్నాడు. జారిపోతున్న నిక్కరు పైకి లాక్కున్నాడు. ఎదురుగా గోడకు వున్న గాంధీగారి పటం చూస్తూ నిల్చున్నాడు.

"సార్..." నీళ్ళు నమిలాడు.

**మీరు రాని మూడు రోజులు వేళ్ళు లెక్క పెట్టుకొని నిజం చెప్పాను సార్, అబద్ధం చెప్పలేదు సార్" తను చెప్పిన సత్యాన్ని వెక్కిళ్ల మధ్య వెల్లడించాడు అమాయకంగా సత్యం.**

"చెప్పవేంరా.." దెబ్బ మీద దెబ్బ వీపు మీద భరత నాట్యం చేసింది.

ఇన్‌స్పెక్టర్‌గారు వేసిన చీవాట్లను ఇచ్చిన మెమోను తలచుకుంటూ మరీ నాలుగంటించాడు.

"సార్ నిన్న వచ్చినాయిన మీ మేష్టారు ఎన్ని రోజులనుండి బడికి రావడం లేదంటే మూడు రోజులని చెప్పా సార్" భయం భయంగా పలికాడు.

"చెప్పావేం.. చెప్పావు.. పెద్ద మూడు రోజులని చెప్పావు" మళ్ళీ రెండంటించాడు.

తనకు మూడు రోజుల అబ్సెంట్ జీతంకట్, మెమో సర్వీస్‌బుక్‌లో రిమార్క్ ఇవన్నీ వీడి మూలాన్నే వచ్చాయి. బడి ఎగ్గొట్టడం తన తప్పుగానట్టు బెత్తం విరిగేవరకు కొట్టి కూర్చున్నాడు.రెండు మూడు రోజుల కోమారు పాఠశాలకు రావడం, ఎటెండెన్స్ వేసుకోవడం, అప్పుడప్పుడు సర్పంచ్‌గారు తనూ విందు చేసుకోవడం, నెలనెలా ఠంచనూగా జీతం తీసుకోవడం సుబ్బారావు మేష్టారుగారి పని. పిల్లలు బడికి రావడం, ఓ గంటసేపు కూర్చోవడం, పలకలు పుస్తకాలు తీసుకుని వెళ్ళడం పిల్లలపని.సార్ సార్ మరేమో మీరు గాంధీ తాత పాఠాల్లో "ఎల్లప్పుడు సత్యమునే పలుకవలెను అసత్య మాట్లాడరాదని చెప్పారు గదాసార్"

"అందుకే మీరు రాని మూడు రోజులు వేళ్ళు లెక్క పెట్టుకొని నిజం చెప్పాను సార్, అబద్ధం చెప్పలేదు సార్" తను చెప్పిన సత్యాన్ని వెక్కిళ్ల మధ్య వెల్లడించాడు అమాయకంగా సత్యం."దిగి వచ్చాడు అపరహరిశ్చంద్రుడు ఫో దరిద్రపు వెధవ" విరిగిన కట్టెను పారవేశారు.

అంతకు ముందు తెలివిగలవాడని ఆదర్శ విద్యార్థిని బుద్ధిమంతుడని ఎంతో మెచ్చుకున్న మేస్టారే నిజం చెప్పినందుకు తనను ఈ రోజు ఇంతగా దండించడం ఎందుకో ఆ పసి మనసుకు బోధపడ్లేదు.



–మేరెడ్డి యాదగిరిరెడ్డి
9949415798







# ఆలోచనాత్మక కవిత్వమే ఎప్పటికీ నిలుస్తుంది

– పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్




## వేడుకగా మహాకవుల జయంతోత్సవం
## ఘనంగా పుస్తకావిష్కరణలు, కాళోజీ పురస్కారాల ప్రదానోత్సవం

తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు వచ్చినప్పటికీ ఆలోచించే విధంగా ఉండే కవిత్వమే ఎప్పటికీ నిలుస్తుందని పద్మశ్రీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించే ఏ రచనైనా కలకాలం నిలబడి పోతుందన్నారు. తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్టులైన మహాకవుల జయంతులను పురస్కరించుకుని త్రివర్ణ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7 న హైదరాబాద్ లోని బిర్లా ప్లానిటోరియంలో గల భాస్కర ఆడిటోరియంలో జరిగిన పుస్తకాల ఆవిష్కరణ మరియు కాళోజీ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యం భాషాపరంగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని నిలదొక్కుకుందన్నారు. సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలున్నాయని అలాంటి ప్రక్రియలన్నింటినీ కవులు రచించాలన్నారు. తెలుగు సాహిత్యంలో నాటికలు తక్కువగా వస్తున్నాయని వాటి పైన దృష్టి పెట్టి రచనలు చేయాలన్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా మహాకవుల జయంతి ఉత్సవాలను జరుపుకోవడం నిజంగా అభినందించదగ్గ విషయమన్నారు. తెలుగు భాషా వికాసానికి గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ అప్పారావు చేసిన సేవ నిత్యం స్మరించుకోవాల్సి ఉందన్నారు. వారి స్ఫూర్తిని నేటి కవులు అందిపుచ్చుకుని రచనలు చేయాలన్నారు.

నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం వచ్చిన తర్వాత ఎంతోమంది కవులు పుంఖాను పుంఖాలుగా కవిత్వం రాస్తున్నారని అన్నారు. వేలకొద్దీ పుస్తకాలు వెలువడ్డాయన్నారు.

అయితే కవులు రాసే కవిత్వంలో ఎంత చిక్కటి కవిత్వం ఉందో ప్రశ్నించుకోవాల్సిన అవసరముందన్నారు. మంచిగా రాసే కవిత్వమే కవిని సాహిత్యంలో నిలబెడుతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ మాజీ చైర్మన్ పొట్లూరి హరికృష్ణ మాట్లాడుతూ మనం రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ మన కవిహృదయం ఒక్కటేనన్నారు. మహాకవుల జయంతులను పురస్కరించుకుని నేషనల్ పోయెట్రీ ఫెస్టివల్ నిర్వహించామన్నారు.

అలాగే కాళోజీ జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన కవులకు, కళాకారులకు కాళోజీ పురస్కారాలను అందజేశామన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగులో బాలసాహిత్య సృజన నేటికవులు చేయాలన్నారు.

విరివిగా బాలసాహిత్యాన్ని సృజనాత్మకతతో రచించాలన్నారు. పూర్వ డి.ఐ.జి. మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ సమాజాన్ని నడిపించేది ఉత్తమ సాహిత్యమేనన్నారు. అలాంటి సాహిత్యమే నిలిచి పోతుందన్నారు.

### ఘనంగా పుస్తకావిష్కరణలు

నేషనల్ పోయెట్రీ ఫెస్టివల్ ను పురస్కరించుకుని పలువురు కవులు రాసిన పుస్తకాలను పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఇక్బాల్‌లు ఆవిష్కరించారు. పొట్లూరి హరికృష్ణ సంపాదకత్వంలో రూపొందిన " వంద కవులు – ఐదొందల మొగ్గలు, మాతృధార" పుస్తకాలతో పాటు లహరి మహేందర్ గౌడ్ రచించిన " లహరీయం", గుండ్లపల్లి మనస్విని రెడ్డి రచించిన " తొలిపూత", నందివాడ చిన్నాదేవి రచించిన " వెన్నెల పాట" , రాపోలు శ్రీదేవి రచించిన " జ్ఞాపకాల జల్లు" , అవధానం అమృతవల్లి రచించిన "మట్టిచివురు" , గరిమెళ్ళ కాశీ అన్నపూర్ణ రచించిన " గోదావరి పరవళ్లు" , డా.మురహరిరావు ఉమాగాంధీ రచించిన " పదనిసలు" , సోమసుందర్ నిమ్మరాజు రచించిన " విభావరి", సిద్ధాంతపు ప్రభాకరాచిర్యులు రచించిన " ప్రభాత కిరణాలు" పుస్తకాలను ఆవిష్కరించారు.

### కాళోజీ పురస్కారాల ప్రదానోత్సవం

తెలుగు సాహిత్యరంగంలో విశేష కృషి చేసిన పలువురు కవులు, కళాకారులకు కాళోజీ పురస్కారాలను అతిథులు అందజేశారు. ప్రముఖ కవులు కోట్ల వేంకటేశ్వర రెడ్డి, డా॥ భీంపల్లి శ్రీకాంత్, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, కొత్త అనిల్ కుమార్, ఎ.గజేందర్ రెడ్డి, భిక్షునాయక్, సృజనశ్రీ, డా॥ రాధా కుసుమ, ఎన్వీ రఘువీర్ ప్రతాప్, తులసీ వెంకట రమణాచార్యులు, సిద్దార్థ ప్రభాకరచారి, ఆకుల రాఘవ, పులి జమున తదితరులకు ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 13,14 వ తేదీలలో నిర్వహించే ప్రపంచ తెలుగు కవుల మహాసభల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మొగ్గల కవులకు మొగ్గల పుస్తకం, ప్రశంసాపత్రం, మాతృధార కవులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కన్నడ కవులు జోషి, రమేశ్ గోపి తదితరులు పాల్గొన్నారు.









డిసెంబర్ 13, 14న నిర్వహించే ప్రపంచ తెలుగు కవుల మహాసభల పోస్టర్ ఆవిష్కరణలో లహరి, డా॥భీంపల్లి శ్రీకాంత్, పూర్వ డి.ఐ.జి., మాజీ ఎమ్మెల్సి ఇక్బాల్, నారంశెట్టి ఉమా మహేశ్వరరావు, బైస దేవదాసు, పొట్లూరి హరికృష్ణ, డా॥నందిని సిధారెడ్డి, ఆచార్య కొలకలూరి ఇనాక్, జోషి, రమేశ్ గోపి










---

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1551వ రోజు 'గ్రామీణ క్రీడలు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'గ్రామీణ క్రీడలు' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

–సంపాదకులు

**మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
–డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



### ఖేలో చలో!

మెరికల్లాంటి గ్రామీణ బాలలు
భావిలో ప్రపంచ పతకాల విజేతలు
ఆరోగ్యం ఆనందం సహజత్వం
ప్రకృతి ఒడిలో గెంతే జింకలు
సెలయేటి పరుగులు.
కర్రాబిళ్ల ఆటే క్రికెట్ అని
జబ్బ చరిచే తాత
తాడాటనే స్కిప్పింగ్ అంటూ
ఆడామగా తేడాలేక గంతులు
జిమ్ పేరుతో వ్యాయామాలు.
అంకెలు లెక్క పెడుతూ
దొంగాటతో లెక్కలు సులభం
కలుగులో ఎలుకలా
దాగున్నవారిని
దాగుడుమూతదండాకోర్ అంటూ
కవ్విస్తూ కిలకిలలు.
పల్నాటి బాలచంద్రుడు
ఆడిన బొంగరాలాటతో
దానిపైనే ఏకాగ్రత
నేలబండ నాల్గుస్థంభాలాటతో
చిలో పాలో అంటూ
పరుగులతో రక్తప్రసరణతో
రోగాలు గాయబ్.
ఆటల్లో దెబ్బ అరటిపండంటూ
కోతికొమ్మచ్చి గల్లీ గల్లీలో గోలీలు
తొక్కుడుబిళ్లతో సాగే ఆటలు
పల్లెపదాల ఊపులతో
ఊయలసయ్యాటలు
ప్రభుత్వ బడులలో ఆడిస్తే
ఆరోగ్య భారత్ అవతరణ
పతకాల పంట.

– ఎ.రాజ్యశ్రీ

### సూక్ష్మంలో మోక్షం

క్రీడలు
మానసిక ఉల్లాసానికి
ఒత్తిడిని తొలగించడానికి
పరస్పర సంబంధాలకు
శారీరక శక్తియుక్తుల ప్రదర్శనకు
ఉత్తమ నడతకు
ఉపయోగపడే ప్రక్రియ క్రీడాలోకం.
క్రీడలంటే
హెచ్చుఖర్చుల భాగోతం
సామాన్యులకు మోయలేని భారం
గ్రామీణ క్రీడలు సరైన సమాధానం
ఖర్చులేకుండా
ఉన్నంతలో సరిపెట్టే
సులభ స్థానిక సాధనాల ఆటలు.
చెడుగుడు –గోటీబిళ్ళ
ఈతలు– స్థంభాలాట
ఏడుపెంకులాట
గళ్లలో కుంటాట
అష్టాచెమ్మాలు,
గోళీలు –చాకలిబండ
దాగుడుమూతలు
దొంగాపోలీసు
ఎన్నెన్నో ఆటలు
సయ్యాటలు
మనసుకి సరిపడేవి
వయస్సుకి తగినవి
స్వల్ప వ్యయం
అధిక ఆనందం.
క్రీడని క్రీడ కోసమే
పరిమితం చేయాలి,
వైరాలకు వైషమ్యాలకు
తావివ్వక
గెలుపు ఓటములను
సహృదయంతో స్వీకరించి
సహకరించాలి
గ్రామీణ క్రీడల
అర్థపరమార్థాలను
గ్రహించడం శ్రేయస్కరం.

–రాజప్ప

### అందుబాటు వస్తువులతో...

ఆటాపాటలే ఆరోగ్య రహస్యాలు
పల్లెపట్టున మహా సరదాలు
అంతంత మాత్రమే విజ్ఞానం
అనుభవాల నీడలే వటవృక్షం.
తొక్కుడుబిళ్ల తోరమైతే
కోతికొమ్మచ్చి కోణంగి ఆట
తాడు బొంగరం తందానా అంటే
చిర్రగోనతో చిందులే గమ్మత్తు.
మల్ల యుద్దాలు ఒళ్ళు పెంచితే
కబడ్డీ ఆటతో కసరత్తులు
ఈతలు కొట్టి అలుపులంటే
కుండ టోక్కతో ఉరుకులు పరుగులే.
ఇంటి బయట ఆడే ఆటలు
ఒంటికి దేహ ధారుఢ్యమే కాకుండా
ఇంటిలోపల కూర్చుండి
మేధకు పదును పెట్టె పులిజీతం
పచ్చీసు అష్టాచెమ్మా ఓనగుంటలు.
హంగు ఆర్భాటాలకు పోకుండా
అందుబాటైన వస్తువులతోనే
ఆటలు సృష్టించారు
కర్ర సాములా
ఉత్తుత్తి కత్తి దాలులు
కనులకానందం

–సగునూరి రాజన్న

### సంప్రదాయ ఆటలు

తర తరాలుగా ఆడే క్రీడలు
సంప్రదాయక్రీడలు
శారీరక శ్రమ
దారుఢ్యంతో
పెరిగే మానసికోల్లాసం
బలపడే
సామాజిక బంధాలు
ఐక్యత.
ఖర్చు లేని ఆటలు
ఆడేవారికి చూసేవారికి
కలిగించే ఉత్సాహం
సత్కాలక్షేపం
తగిలే దెబ్బలు చిన్నవి
నేటి క్రికెట్ కి ఆద్యం
నాటి బిళ్ళం గోడు
మూరెడు కర్రతో
జానెడు కర్ర ముక్కని
దూరంగా కొట్టటం
క్రికెట్ ఆటలో
తగిలే పెద్ద గాయాలు
ఫ్రాక్చర్లు లేని
పసందైన ఆటలు
ఖరీదైన స్పోర్ట్స్ కిట్లు లేవు.
మంచి క్రీడా కారులు
మట్టిలో మాణిక్యాలు
గ్రామీణ నివాసులే
లభిస్తే తగిన ప్రోత్సాహం
మెరుపులై మెరిపిస్తారు
అంతర్జాతీయ క్రీడల్లో.

–మోటూరి శాంతకుమారి

### చలో చల్!

స్వచ్ఛమైన మనసులు
బాలలు పల్లె సొగసులు
అల్లరి కన్నయ్యలు
ఆగడాలతో
చెట్టూ పుట్టా
పరుగులు పెడుతూ
గల గల నవ్వుతూ
సెలయేరుల్లో
ఈతలు కొడుతూ
లేడిలా గెంతులు వేస్తూ
పొలాల గట్లపై
కుందులు వేస్తూ
కోతి కొమ్మచ్చిలా
చెట్లపై ఊయలలూగుతూ
ఆనందాల హరివిల్లులు
అరమరికలు లేని
స్నేహానికి నెలవులు..
ప్రకృతి ఒడిలో పెరిగిన
జీవన జ్యోతులు
దొంగాటలు
కర్రా బిళ్ళా ఆటలతో
టైరు చక్రాలను
గిరగిర తిప్పుతూ
కోకో అంటూ
పరుగులు పెడుతూ
కబడ్డీ చెడుగుడు
చెండాటలు
ఆటలో
ఒకరితో ఇంకొకరు పోటీ పడుతూ
ఆరోగ్యానికి పెట్టని కోటలు.
ఇల్లంతా చేరుతుంది
ఒకే పంచలో
అష్టాచమ్మా
వామన గుంటలతో
చెమ్మాచెక్కా
చెండాటలు పోతూ
ఒప్పులకుప్పా
వయ్యారి భామల
గాజుల గలగలలతో
ఆనాటి పల్లెలు
కానీ ఖర్చు లేకుండా
వ్యాయామానికి విందులు.
నేడు అవుతున్నాయి పల్లెలు
జూదాలకు కేంద్రాలు
సారా మత్తుల
దురభ్యాసాలతో
జీవనోపాధిని కోల్పోతున్న
ముప్పులు
అంతరించిపోతున్న క్రీడలను
ప్రోత్సహించాలి సర్కార్ బళ్లు
పునరుద్ధరించాలి
ఆహ్లాదాన్ని ఆరోగ్యాన్ని
పెంపొందించే గ్రామీణ క్రీడలతో.

– పి.పద్మావతి

### సందడే సందడి ఆటలతో!

పల్లె సీమలు భాగ్యసీమలు!
ఆటపాట్లకు కొదువ లేదచట!
దాగుడుమూతలు
దొంగా–పోలీస్,
కోతికొమ్మచ్చిలా చెట్లపై ఊగడం
కర్రా– బిళ్ళాట, టైరు తిప్పడం
చెడుగుడు, పరుగు పందాలు
ఇలా ఎన్నెన్నో ఆటలు!
కూర్చుని ఆడే
అష్టాచమ్మా ఆటకు,
చింతపిక్కను అడ్డగా చీల్చి
నప్పులుగా,
తెల్లని భాగం చెమ్మ
తిరగేస్తే అష్ట
చెమ్మకు లెక్కింపు నాలుగు
అష్ట కు లెక్కింపు ఎనిమిది!
పులీ– మేక ఆట
ఇంకా సరదా!
పెద్ద నొప్పులు
మూడు పులులుగా
చిన్నవి పదహారు మేకలుగా
పులులను బంధిస్తే మేకల గెలుపే!
దాడి ఆట అయితే మరీ సరదా!
తొమ్మిది నప్పుల ఆట
వరుసగా మూడు
నప్పులు వస్తే దాడి!
అమ్మాయిలు ఆడే గవ్వలాట లో
గవ్వలను అరచేతిలో పట్టి
చేయి తిప్పి మండపై ఉంచాలి!
వామన గుంటలు
అత్తా కోడళ్ళ ఆట!
వైకుంఠ పాళి మరీ సరదా ఆట!
నిచ్చెనలెక్కి
ఉత్సాహంగా పోతూ
ఒక్కసారిగా పాము మింగితే
కిందకు వచ్చేస్తాడు ఆటగాడు
వాడి మొహం అప్పుడు
చూడ ముచ్చట!
అయినా వదలక
ఆడి గెలుస్తాడు!
పండగల్లో టగాపు వారు
ఆటైతే తాడు మధ్యలో
ఒక ముడి వేసి
ఎవరి వైపు ముడి వెళుతుందో
వారే గెలిచి మిగతా పడతారు!
కోడి పందేలు
పొట్టేలు పోటీలు,
గంజాయి మత్తు
పేకాటలు మానితే,
ఆనందమే ఆనందం పల్లెల్లో !!.

–కోలా సత్యనారాయణ

### దాగుడు మూతలు

ఖర్చులు లేని ఆటలు ఇంటింటా
వానొస్తే నీటికి ఆనకట్టల ఆట
సమగ్ర వికాస విపంచి
శారీరక దృఢత్వానికి
ఆధారభూతం
నిత్యచైతన్య
స్ఫూర్తి మంత్రం
ఆటలతో హంగామాలు
ఆనాడు గ్రామాల్లో
నాటి ఆటలు
నేడు కనుమరుగు దిశలో
నేటి పిల్లలు ఆడే
ఆట చక్రాలను నడిపే
చేతిలో చరవాణి
నేటి గ్రామీణ క్రీడ
గోళీల ఆటలు మటుమాయం
దాగుడు మూతలు
దండాకోరంటూ ఆట
నేటి చిన్నారులకు
అంతటి మిత్రులెక్కడ
గిల్లి దండు ఆట
నేడు మటుమాయం
జాడు బందర్ ఆట
నేడెక్కడో
కబడ్డీ ఇంకా
కనుమరుగు కాలేదింకా
పొద్దు పోని పులి మేక ఆట
ఇపుడెక్కడో
వాన గుంటల ఆటలు లేవు
కుంటి బిచ్చ ఆట
కనుమరుగాయె
చెమ్మ చెక్క
చారడేసి మొగ్గల
మొమెక్కడో
గ్రామీణ ఆటలకు
లేదు ఆదరణ
నగరీకరణతో
గ్రామీణ క్రీడల రూపం
మార్పు.

– లక్ష్మారెడ్డి పసుల

